# రాష్ట్రంలో ప్రమాదకరంగా కరోనా పరిస్థితి

## కేసులు పెరుగుతున్నా పట్టింపులేని సర్కార్: బండి

హైదరాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పరిస్థితి ప్రమాదకరంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ప్రధానంగా కరోనా విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని అన్నారు. డాక్టర్లకే దిక్కు లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. ఏం జరిగినా కేంద్రమే చెప్పిందంటున్నారన్నారు. రాష్ట్రంలో కరోనా కేసులు భారీగా పెరుచికిత్స ట్రీట్మెంట్ చేస్తున్న డాక్టర్లకు వసతి కల్పించడం లేదన్నారు. ట్రీట్మెంట్ చేస్తున్న డాక్టర్లకు ఎన్-95 మాస్కులు లేవన్నారు. కరోనా హెల్త్ బులిటెన్ కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. టెస్టులు చేయకుండానే రాష్ట్రంలో కేసుల సంఖ్య పెరిగిందన్నారు. టెస్టులు పెరిగితే కేసులు చాలా పెరుగుతున్నాయన్నారు. కరోనా వచ్చినా డ్యూటీ చేయాలని పీజీ డాక్టర్లను బెదిరిస్తున్నారన్నారు. పీజీ మెడికల్ స్టూడెంట్స్‌కు టెస్టులు ఎందుకు చేయడం లేదన్నారు. గాంధీ, ఉస్మానియాలో స్టాఫ్ లేరన్న విషయాన్ని కూడా పెద్దగ ఆపట్టించుకోవడం లేదని బండి సంజయ్ అన్నారు. ఇంత దదారుణంగా పరిస్తితులు ఉన్నా,రోజురోజుకు కరోనా కేసులు పెరుగుతున్నా సిఎం కెసిఆర్ పెద్దగా పట్టించుకోవడం లేదన్నారు.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 9-6-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 270 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# సినిమా, టీవీ షూటింగ్‌లకు ప్రభుత్వం అనుమతి



హైదరాబాద్: కోవిడ్-19 మార్గదర్శకాలు, లాక్‌డౌన్ నిబంధనలు పాటిస్తూ తెలంగాణ రాష్ట్రంలో సినిమా, టీవీ కార్యక్రమాల షూటింగులు కొనసాగించుకోవడానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అనుమతి ఇచ్చారు. దీనికి సంబంధించిన ఫైలుపై కేసీఆర్ సోమవారం సంతకం చేశారు. రాష్ట్రంలో పరిమిత సిబ్బందితో, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ సినిమా/ టీవీ కార్యక్రమాల షూటింగులు నిర్వహించుకోవచ్చని, షూటింగులు పూర్తయిన వాటి పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వెంటనే నిర్వహించుకోవచ్చని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాల్సి ఉన్నందున థియేటర్లను ప్రారభించడానికి ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. సినిమా పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి సినిమా, టీవీ షూటింగులకు, పోస్టు ప్రొడక్షన్ పనులకు, సినిమా థియేటర్ల తెరవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, విధి విధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

దీంతో మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, సినీరంగ ప్రముఖులు సమావేశమై విధివిధానాల ముసాయిదా రూపొందించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి, పరిమిత సిబ్బందితో షూటింగులు, పోస్టు ప్రొడక్షన్ పనులు నిర్వహించుకుంటామని సినీ రంగ ప్రముఖులు హామీ ఇచ్చారు. దీనిని అనుసరించి ముఖ్యమంత్రి కేసీఆర్ షూటింగులు, పోస్టు ప్రొడక్షన్ పనులకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఇప్పటికిప్పుడు సినిమా థియేటర్లను తెరిచేందుకు అనుమతి ఇవ్వలేమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# దేశంలో ఆగని కరోనా ఉధృతి

## దేశవ్యాప్తంగా కొత్తగా 9983 పాజిటివ్ కేసులు నమోదు

## చైనాను మించిపోయిన మహారాష్ట్ర

న్యూఢిల్లీ,జూన్8(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా ఉధృతి కొనసాగుతున్నది. వరుసగా ఆరో రోజూ తొమ్మిది వేలకుపైగా కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా కొత్తగా 9983 పాజిటివ్ కేసులు నమోదవడంతోపాటు, 206 మంది మరణించారు. దీంతో దేశంలో కరోనా కేసుల సంఖ్య 2,56,611కి పెరిగింది. ఇప్పటివరకు నమోదైన మొత్తం కేసుల్లో 1,24,095 మంది బాధితులు కోలుకోగా, మరో 1,25,381 మంది దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. దేశంలో ఇప్పటివరకు ఈ ప్రాణాంతక వైరస్ వల్ల 7135 మంది మరణించారు. మహారాష్ట్రలో ఆదివారం కొత్తగా 3007 పాజిటివ్ కేసులు నమోదవడంతో కరోనా పుట్టిల్లు చైనాను వెనక్కి నెట్టింది. రాష్ట్రంలో ప్రస్తుతం 85,975 కరోనా పాజిటివ్ కేసులు ఉన్నాయి. చైనాలో ఇప్పటివరకు 83,036 కేసులు నమోదయ్యాయి. దీంతో చైనాకంటే ఎక్కువ కరోనా కేసులు ఒక్క మహారాష్ట్రలోనే నమోదవడం విశేషం. 31,667 కరోనా కేసులతో తమిళనాడు రెండో స్థానంలో ఉండగా, 27,654 కేసులతో ఢిల్లీ, 20,700 పాజిటివ్ కేసులతో గుజరాత్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మధ్యప్రదేశ్ (9401), పశ్చిమబెంగాల్ (8187), కర్ణాటక (5452), బీహార్ (5088)లో ఐదువేలకు పైచిలుకు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

# జూబ్లీహిల్స్ వెంకన్నను దర్శించుకున్న గవర్నర్

హైదరాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): గవర్నర్ తమిళిసై కుటుంబ సమేతంగా జూబ్లీహిల్స్‌లోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. లాక్‌డౌన్ సడలింపులు ఇవ్వడంతో ఆమె స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర తరపున ప్రజల గురించి స్వామివారిని ప్రార్ధించినట్టు తెలిపారు. కరోనా మహమ్మారి ఇప్పట్లో వెళ్లదని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అందరూ మాస్కులు వాడాలని.. భౌతిక దూరం పాటించాలన్నారు. అవసరం ఉన్న వాళ్ళు మాత్రమే బయటకి రావాలని తమిళిసై ప్రజలకు సూచించారు. ఆలయం నుంచి గవర్నర్ తమిళిసై నేరుగా నిమ్స్‌కు వెళ్లారు. నిమ్స్‌లోని మిలినియం బ్లాక్‌ను పరిశీలించారు. పరిశీలన అనంతరం నిమ్స్ హాస్పిటల్ అధారిటితో గవర్నర్ సమావేశం అయ్యారు. డాక్టర్లకు అందుతున్న వైద్యంపై తమిళి సై ఆరా తీసారు. ఫ్రంట్ లైన్‌లో ఉన్న మెడికోలకు పాజిటివ్ రావటం బాధాకరమని గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు. ఒక డాక్టర్‌గా వాళ్ళను పరామర్శించానన్నారు. రిలాక్సేషన్ వల్ల కేసులు పెరుగుతున్నాయని.. కానీ తప్పదన్నారు. మెడికోలకు టెస్టులు చేయమని గవర్నమెంట్‌కు రిక్వెస్ట్ చేస్తానన్నారు. నాన్ సింటమ్స్ పెరుగుతున్నారని.. తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కరోనా వైరస్ కారణంగా మృతి చెందిన జర్నలిస్టుకు తమిళిసై సంతాపం తెలిపారు.

## నిమ్స్‌లో వైద్యులకు పరామర్శ..

## జర్నలిస్ట్ కుటుంబానికి తరలింపు

# తెరుచుకున్న ఆలయాలు

## ఉత్సాహంగా చేరుకున్న భక్తులు

## కళకళలాడిన ఆలయపరిసరాలు

## తిరుమలలో ప్రత్యేక ముస్తాబు

## యాదాద్రిలో ప్రత్యేక ఏర్పాట్లతో దర్శనాలు

హైదరాబాద్/విజయవాడ, జూన్8(ఆర్ఎన్ఎ): లాక్ డౌన్‌తో కొద్ది రోజులుగా భక్తులకు దూరంగా ఆలయాలు మళ్లీ తెరచుకున్నాయి. నిబంధనల సడలింపులతో ఇప్పుడు ఆలయాలు మళ్లీ కళకలలాడుతూ కనిపించాయి. విశ్రాంతిలో ఉన్న దేవుళ్లు మళ్లీ భక్తులకు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో సోమవారం ఆలయాలు తెరుచుకోవడంతో భక్తులు ఉత్సాహంగా ఆయా ఆలయాలకు చేరుకున్నారు. ఆలయాలతో పాటు చర్చిలు, మసీదులకు అనుమతి ఇవ్వడంతో దేశవ్యాప్తంగా తెరుచుకున్నాయి. అయితే అన్ని చోట్ల పరిమిత సంఖ్యలోనే భక్తులను అనుమతిచ్చారు. ప్రధాన ఆలయాల్లో ముందుగా రెండురోజుల పాటు ఆలయ ఉద్యోగులు, స్థానికులతో ట్రయల్ రన్ నిర్వహించిన తర్వాత సామాన్య భక్తులకు అనుమతి ఇవ్వనున్నారు.

తిరుమలలో సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. రెండున్నర నెలల తర్వాత శ్రీవారి దర్శనానికి అనుమతి ఇస్తున్నారు. ట్రయల్ రన్ కింద ఉద్యోగులను దర్శనానికి అనుమతించారు. మంగళవారం కూడా కొంతమంది టీటీడీ సిబ్బందికి ఆలయ ప్రవేశం ఉంటుంది. జూన్ పదిన తిరుమలలో స్థానికులకు అవకాశం కల్పిస్తారు. ఈనెల 11 నుంచి సాధారణ భక్తులను అనుమతిస్తారు. ఉదయం 6-30 గంటల వరకు వీఐపీ బ్రేక్ దర్శనం.. ఆపై రాత్రి 7-30 గంటలవరకు సాధారణ భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఆన్ లైన్‌లో 3 వేల టిక్కెట్లు అలిపిరి వద్ద ఉండే కౌంటర్ల ద్వారా మరో 3వేల టిక్కెట్లు విక్రయిస్తారు. ఆన్‌లైన్లో దర్శనం టిక్కెట్లతోపాటే అద్దెగదులను బుక్ చేసుకోవచ్చు. ఒక గదిలో ఇద్దరికే అనుమతి ఇస్తారు. ఇది 24 గంటలకే పరిమితమని పొడిగింపుకు వీల్లేదు. ఆర్జిత సేవలకు భక్తులకు అనుమతి లేదు. తీర్థప్రసాద వితరణ ఉండదు. దర్శనానికి ఎవరి సిఫారసు లేఖలు చెల్లవు. ప్రొటోకాల్ ఉన్న వీఐపీలు వ్యక్తిగతంగా వస్తే వారికి మాత్రమే ఉదయం 6-30 నుంచి 7-30 గంటల వరకు బ్రేక్ దర్శనం కల్పిస్తారు. గంటకు 500 మంది భక్తులకు మాత్రమే శ్రీవారి దర్శనానికి అనుమతించనున్నారు. రోజుకు 6వేల మంది భక్తులకు మాత్రమే స్వామి వారి దర్శనం లభించనుంది. మహమ్మారి కరోనా వైరస్ కారణంగా మూసివేసిన తిరుమల దేవస్థానాన్ని దాదాపు 75 రోజుల తర్వాత టిటిడి తిరిగి ప్రారంభించింది. ఈ సందర్భంగా స్వామి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం నుంచి ప్రారంభమైన శ్రీవారి దర్శనాలకు మొదటి రెండు రోజులు టిటిడి ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించారు. ఈ నెల 10వ తేదీన స్థానికులకు, 11వ తేది నుంచి భక్తులందరికీ దర్శనం కల్పించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశారు.

మాస్కులు ధరిస్తేనే లోపలికి అనుమతి ఇవ్వనున్నారు. లడ్డు ప్రసాద కౌంటర్ల వద్ద తగిన ఏర్పాట్లు చేయనున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు దర్శనాలకు రావొద్దని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు. కొండపైకి వాహనాలకు అనుమతి నిరాకరించారు. ఇకపోతే ప్రధాన ఆలయాల్లో దర్శనాలకు అనుమమతించారు. యాదాద్రిలో ప్రత్యేక ఏర్పా÷-టలు చేశారు. భక్తులను పరిమిత సంఖ్యలోనే అనుమతించారు. దీంతో ఉదయం నుంచి భౌతిక దూరం పాటిస్తూ దర్శనాలకు అనుమతించారు. శ్రీశైలంమహానంది, కసాపురం ఆంజనేయస్వామి, కాణిపాకం, శ్రీకాళహస్తి, వేములవాడ, భద్రకాళి, యాదాద్రి ఆలయాల్లో పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన వేయి స్తంభాల గుడిలో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆలయాల ప్రవేశం సందర్భంగా భక్తులకు థర్మల్ స్క్రీనింగ్ చేస్తూ ఆలయ సిబ్బంది లోపలికి అనుమతి ఇచ్చారు. అలాగే భౌతిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించిన వారిని మాత్రమే లోపలికి అనుమతించారు. దీంతో భక్తులు ఇలా నిబంధనలు పాటిస్తూ దైవ దర్శనం చేసుకుంటున్నారు.

## జోగులాంబ ఆలయంలో మంత్రి పూజలు

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండున్నర నెలల తర్వాత ఆలయాలు తెరుచుకోవడంతో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కరోనా నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఆలయాల్లో తగు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను శానిటైజర్ చేయడంతో పాటు భౌతిక దూరం పాటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తులకు టెంపరేచర్ స్కానింగ్ చేసి మాస్కులు ఉన్న వారిని లోవలికి అనుమతిస్తున్నారు. జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కొవిడ్ నిబంధన అమలును మంత్రి పరిశీలించారు.

# సిఎం సహాయనిధి నుంచి లక్ష మంజూరు

హైదరాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకోలేని నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తికి లక్ష రూపాయల ఎల్వోసీని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేశారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన బి.తిరుపతి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థికంగా వెనుకబడటంతో చికిత్స చేసుకోలేని పరిస్థితిలో ఆదుకోవాలని మంత్రిని కలిశారు. వారి దయనీయ పరిస్థితిని అర్థం చేసుకొని సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన లక్ష రూపాయల ఎల్వోసీ కాపీని లబ్దిదారుని కుటుంబానికి మంత్రి కొప్పుల అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో రోగిపై కత్తులతో దాడి చేసి హత్య

చెన్నై,జూన్8(ఆర్ఎన్ఎ): తమిళనాడులోని మధురైలో దారుణం జరిగింది. రాజాజీ ఆస్పత్రికిలోకి సోమవారం ఉదయం నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో ప్రవేశించారు. చికిత్స పొందుతున్న ఓ రోగిపై వదునైన ఆయుధాలతో విచక్షణారహితంగా దాడి చేశారు.

ఈ దాడిలో రోగి తీవ్రంగా గాయపడడంతో తీవ్ర రక్తస్రావమైంది. దీంతో రోగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు రాజాజీ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కడున్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆస్పత్రిలో హత్య జరిగే సరికి మిగతా రోగులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఆస్పత్రి వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

# రైతులు ఆర్ధికంగా ఎదిగేలా చేస్తున్న కేసీఆర్

## నియంత్రిత సాగుతో పంటలకు అనుకున్న డిమాండ్

## పల్లెప్రగతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యవతి

ములుగు,జూన్8(ఆర్ఎన్ఎ): వ్యవసాయం పండగ కావాలని, రైతును రాజు చేయడమే లక్ష్యంతో సీఎం కేసీఆర్ దేశంలో ఎవరూ చేయని విధంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. నియంత్రిత పంటల సాగుతో రైతులకు మద్దతుగా నిలిచారని అన్నారు. చెప్పిన పంటలు వేయడం ద్వారా మార్కెట్లో డిమాండ్ పొందవచ్చాన్నారు.

ప్రతిపక్షాలకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. జిల్లాలోని గోవిందరావుపేట మండలంలోని పస్రా, చల్వాయి, మచ్చాపూర్ గ్రామాల్లో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కరోనా కష్టకాలంలో కూడా రైతులు నష్టపోకూడదని పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. నేడు ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి రైతు వద్దకు వచ్చి వారి కోసం పనిచేస్తున్నారని, గత పాలకులు ఈ విధంగా ఒక క్వింటా అయినా కొనుగోలు చేశారా? అని ప్రశ్నించారు. రైతు గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు.ఒక వైపు మహమ్మారి కరోనా వైరస్ కట్టడి కోసం ఆర్థికంగా రాష్ట్రం నష్టపోతున్నా లాక్ డౌన్ అమలు చేసి, తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే వ్యవసాయానికి, రైతుకు కావాల్సిన అన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రైతును రాజు చేయడానికి ప్రాజెక్టుల ద్వారా నీరిస్తున్నారని, 24 గంటల ఉచిత విద్యుత్ , రైతు బంధు, రైతుబీమా ఇస్తున్నారని, ఇప్పుడు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. ఇక్కడ గోదావరి ఉన్నా ఇంకా కొన్ని గ్రామాలకు నీరు రావడం లేదని చెబుతున్నారని, త్వరలోనే లక్నవరం ద్వారా నీరు వచ్చేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించి, దాదాపు 1500 ఎకరాలను సస్యశ్యామలం చేసేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. మంత్రి వెంట స్థానిక నేతలు పాల్గొన్నారు.

# గ్రేటర్‌లో మళ్లీ పెరుగుతున్న కాలుష్యం

## వాహనాలు పెరగడమే కారణమని వెల్లడి

హైదరాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాలుష్యం తీవ్రత మోస్తరు నుంచి సంతృప్తికరంగా నమోదైంది. దశల వారీగా లాక్‌డౌన్‌లో సడలింపులు ఇస్తుండడంతో మళ్లీ రోడ్లపైకి ట్రాఫిక్ ఒక్కసారిగా వచ్చి చేరుతోంది. దీంతో కాలుష్య తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరుతోంది. ఇటీవల మళ్ల ఈవాహనాలు పెరగడంతో ఈ స్థాయి పెరుగుతోంది. ఇది మరింత పెరగగలదన్నారు. గత సోమవారం నమోదైన లెక్కలే ఇందుకు నిదర్శనం. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద నమోదైన వాయు కాలుష్య తీవ్రత చాలా ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ సాయంత్రం 6-7 గంటల సమయంలో 237 మైక్రో గ్రామ్స్ ఇన్ క్యూబిక్ మీటర్లుగా నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లాక్‌డౌన్ 5వ విడత సడలింపులు అమల్లోకి రావడంతో ఒక్కసారిగా ట్రాఫిక్ పెరిగింది. ప్రజా రవాణా వ్యవస్థలు మినహాయిస్తే ప్రైవేటు పరంగా ఆటో రిక్షాలు, క్యాబ్‌లు, సొంత వాహనాలైన ద్విచక్ర వాహనాలు, కార్లు పెద్ద మొత్తంలోనే రోడ్లమీదకు వచ్చాయి. దీంతో గ్రేటర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోడ్లపై ట్రాఫిక్ రద్దీ కనిపించింది. ముఖ్యంగా గూగుల్ లైవ్ ట్రాఫిక్‌ను పరిశీలిస్తే మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల సమయంలో రోడ్లపై ఎక్కువగా ట్రాఫిక్ ఉన్నట్లు రికార్డయింది. వచ్చే కొన్ని రోజుల్లో పెరిగే ట్రాఫిక్‌ను బట్టి కాలుష్యం స్థాయి ఎంత వరకు ఉందనేది అర్థమవుతుంది.

# గ్రేటర్ కార్యాలయంలో ఉద్యోగికి కరోనా పాజిటివ్

## ఉద్యోగులను ఖాళీ చేయించి ఇళ్లకు పంపిన అధికారులు

హైదరాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనాకు కేంద్ర బిందువుగా మారిన హైదరాబాద్‌లో పాజిటివ్ కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. నగరంలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి కరోనా పాజిటివ్ అని తేలింది.

బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో ఓ సెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగికి కరోనా నిర్ధారణ అయ్యింది. దీంతో అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను అధికారులు ఇళ్లకు పంపించి, శానిటైజేషన్ చేస్తున్నారు. ప్రధాన కార్యాలయంలో సుమారు 15 వందల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో ఆదివారం కొత్తగా 154 మందికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలోనే 132 మంది కరోనా బాధితులు ఉన్నారు. కాగా, రాష్ట్రంలో ఇప్పటివరకు 3650 కరోనా కేసులు నమోదవగా, 137 మంది మరణించారు. 1742 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. మిగిలిన 1771 మంది గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్నారు.

# పోలీసులకు థర్మల్ స్క్రీనింగ్ తప్పనిసరి!



హైదరాబాద్,జూన్ 8: కరోనా వైరస్ వ్యాప్తి పోలీసు డిపార్ట్‌మెంట్‌లో కలవరం రేపుతోంది. ఎవరు తుమ్మినా, దగ్గినా, జ్వరం అని చెప్పినా ఉలిక్కిపడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖలో ఇప్పుడు హెల్త్ డీఎస్ఆర్‌ను ప్రవేశపెట్టారు. ఉదయం, సాయంత్రం కచ్చితంగా పోలీసులు తమ ఆరోగ్య స్థితిగతులను నమోదు చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. ఇందుకుగాను నగరంలోని పోలీసు స్టేషన్లలో థర్మల్ స్క్రీనింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉదయం విధులకు హాజరైన సమయంలో, విధులు ముగించుకొని ఇంటికి వెళ్ళేటప్పుడు కచ్చితంగా శరీర ఉష్ణోగ్రతలు చెక్ చేసుకుని ఆ వివరాలను హెల్త్ డీఎస్ఆర్ యాప్‌లో పొందుపర్చాలి. జ్వరంగా అనిపించినా, గొంతునొప్పి, దగ్గు, జలుబు ఉన్నా ఆయా వివరాలను యాప్‌లో తెలియజేయాలి. వీటిని కమిషనర్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచి విభాగం సిబ్బంది నిత్యం పరిశీలిస్తారు. థర్మల్ స్క్రీనింగ్‌లో శరీరం ఉష్ణోగ్రతలు 100 సెల్సియస్ దాటితే దవాఖానకు వెళ్ళాలని సూచిస్తున్నారు. హోంగార్డు నుంచి సీపీ వరకు.. అన్ని పోలీసు స్టేషన్లు, మినిస్ట్రీరియల్ స్టాఫ్‌కు థర్మల్ స్క్రీనింగ్ చేస్తున్నారు. ఇదేమాదిరిగా రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కూడా చర్యలు తీసుకుంటున్నారు. సిబ్బంది ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతిరోజు ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. రెండు రోజులకు ఒక్కసారి స్టేషన్‌ను శానిటైజ్ చేస్తున్నారు. డ్యూటీ నుంచి ఇంటికి వెళ్ళే సమయంలో బట్టలను డిస్ఇన్‌ఫెక్షన్ నీళ్లతో శుభ్రం చేసుకొంటున్నారు. చేతులు శుభ్రం చేసుకొనేందుకు వాష్ బేసిన్‌లను నెలకొల్పారు. స్టేషన్ వచ్చేవారు కూడా మొదట చేతులు శుభ్రపరుచుకొని, థర్మల్ స్క్రీనింగ్, శానిటైజ్ చేసుకోవడంతోపాటు కచ్చితంగా మాస్క్ ధరించాలని పోలీసులు సూచిస్తున్నారు.

## చరిత్రలో నేటినిజం







(జూన్ 9 సుందర్‌లాల్ బహుగుణ జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

# వినియోగించిన విద్యుత్‌కే బిల్లు వచ్చింది: మంత్రి జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 8: కరోనా వైరస్ కారణంగా ప్రపంచమంతా స్థంభించిపోయిందని మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. గత మూడు నెలలుగా ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారని చెప్పారు. విద్యుత్ బిల్లు ఎక్కువగా వచ్చిందనే ఆందోళనల్లో వాస్తవం లేదని మంత్రి తెలిపారు. ఇవాళ మీడియా సమావేశంలో జగదీశ్ రెడ్డి మాట్లాడారు.

'లాక్‌డౌన్ సమయంలో విద్యుత్ సంస్థల పని పెరిగింది. వేసవిలో కరెంట్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. లాక్‌డౌన్ వల్ల ప్రజలు ఇండ్లకే పరిమితం కావడంతో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. లాక్‌డౌన్ వల్ల విద్యుత్ రీడింగ్ తీసేందుకు సిబ్బంది ఇండ్లకు వెళ్లలేదు. ఈఆర్సీ సూచనల మేరకు గత ఏడాది మార్చి, ఏప్రిల్ బిల్లులను ఈసారి వసూలు చేశాం. కరెంట్ బిల్లుల్లో రూపాయి కూడా ఎక్కువ తీసుకోలేదని' మంత్రి పేర్కొన్నారు.

సరైన పద్ధతుల్లోనే బిల్లులు ఇచ్చాం. కరెంట్ ఎక్కువ వాడడం వల్ల కేటగిరీల్లో మార్పులు వచ్చాయి. విద్యుత్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. కేటగిరీ మారడం వల్లే బిల్లులు అధికంగా వచ్చాయి. వినియోగదారులు వినియోగించిన విద్యుత్‌కే బిల్లు వచ్చింది. 3 నెలలకు కలిపి ఒకేసారి బిల్లు ఇవ్వడంతో ఎక్కువగా వచ్చినట్లు భావిస్తున్నారని జగదీశ్ రెడ్డి వివరించారు.

# రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో అధిష్టానం షాక్

బెంగళూరు,జూన్8(ఆర్ఎన్ఎ): కర్ణాటక సీఎం యెడియూరప్పకు బీజేపీ షాక్ ఇచ్చింది. ఆయనతోపాటు ఆ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు నలిన్ కుమార్ కతీల్ ఎంపిక చేసిన ముగ్గురు రాజ్యసభ అభ్యర్థుల పేర్లను బీజేపీ అధిష్ఠానం పట్టించుకోలేదు. వారు సూచించిన రమేశ్ కట్టి, ప్రకాశ్ శెట్టి, ప్రభాకర్ కోరే పేర్లను పక్కకు పెట్టింది. పార్టీలో అంతగా ప్రాచుర్యం లేని ఎర్రన్న భీమప్ప కదాది, అశోక్ జాస్తి పేర్లను ఖరారు చేసింది. ఈ విషయం తెలిసి తాను ఆశ్చర్యపోయినట్లు ఆ పార్టీ అధికార ప్రతినిధి ఎస్ ప్రకాశ్ స్వయంగా అంగీకరించారు. అయితే కిందిస్థాయి నేతల సేవలకు గౌరవం దక్కిందన్నారు. మరోవైపు యెడియూరప్ప వారసుడి కోసం కూడా బీజేపీ అన్వేషిస్తున్నట్లు సమాచారం.

# ఢిల్లీలో వైద్యం చేయించుకోకుండా ఆంక్షలేమిటి

## కేజ్రీవాల్సర్కార్ నిర్ణయంపై మాయావతి మండిపాటు

లక్నో,జూన్8(ఆర్ఎన్ఎ): ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అనారోగ్యం పాలైతే ఢిల్లీలో వైద్యం పొందేందుకు అవకాశం లేకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షురాలు యాయవతి తప్పుపట్టారు. ఢిల్లీ ప్రభుత్వ నిర్ణయంపై కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. సోమవారం లక్నోలో ఆమె మాట్లాడుతూ దేశ రాజధానికి వివిధ పనులపై అనేక రాష్ట్రాల నుంచి ప్రజలు వస్తుంటారని, అనుకోకుండా వారు అనారోగ్యం పాలైతే చికిత్స అందించకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. లాక్‌డౌన్ సడలింపుతో జనాలు ఇష్టానుసారంగా ప్రయాణం చేయకుండా సంయమనం పాటించాలని కోరారు. కరోనా నియంత్ర ణకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. కాగా ఢిల్లీలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆదివారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నడిచే హాస్పిటళ్లలో మినహా ఢిల్లీ దవాఖానల్లో ఇతర ప్రాంతాలకు వారికి వైద్య సేవలం దించబోమని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# తెలంగాణలో పదో తరగతి పరీక్షలు రద్దు

హైదరాబాద్, జూన్ 8: తెలంగాణలో పదో తరగతి పరీక్షలు రద్దు చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. పరీక్షలు లేకుండానే విద్యార్థులను ప్రమోట్ చేస్తున్నట్లు నిర్ణయించింది. ఇంటర్నల్, అసెస్‌మెంట్ మార్కుల ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వనున్నారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో రాష్ట్రంలో పదోతరగతి పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు సుమారు 5.34లక్షల మంది పాస్‌అయినట్లుగా అధికారులు సర్టిఫికెట్లు ఇవ్వనున్నారు. డిగ్రీ, పీజీ పరీక్షల నిర్వహణపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడించింది.

# మృగాలు ఎవరు?

నేటినిజం
మంగళవారం 9-6-2020

మెదడు పెద్దగా వుండి, తెలివున్న జంతువుల్లో ఏనుగు మూడోది. అది ఎన్నో అనుభ వాలను నిక్షిప్తం చేసుకోగలదంటారు. ఎంతదూరం వెళ్లినా తాను సంచరించే దారుల్ని పక్కాగా గుర్తుంచుకుని మళ్లీ అదే దారిలో వెనక్కివెళ్లగలగడం దాని ప్రత్యేకత. అంతటి ప్రాముఖ్యత వున్న ఏనుగుల్ని 'దేవుడి స్వస్థలం'గా పిలుచుకునే కేరళలో దుండగులు వెంటాడి హతమారుస్తున్నారని వస్తున్న వార్తలు దేశం మొత్తాన్ని కదిలించాయి. ముఖ్యంగా ఆ రాష్ట్రంలోని పాలక్కడ్ జిల్లాలో తటస్థ ప్రాంతంగా ప్రకటించినచోట ఒక ఆడ ఏనుగును పైనాపిల్ ఫలంలో బాంబు పెట్టి ప్రాణం తీసిన తీరు అందరినీ కలచివేసింది. ఈ ఏనుగు గర్భిణి కూడా కావడంతో వన్యప్రాణి సంరక్షణ రంగంలో పనిచేసేవారితోపాటు ఇతరులు కూడా స్పందించారు. ఇది ఈమధ్యకాలంలో జరిగిన మొదటి ఘటన కూడా కాదు. మొన్న ఏప్రిల్ నెలలో కొల్లాం జిల్లాలో మరో ఆడ ఏనుగును గుర్తుతెలియని వ్యక్తులు ఇలాగే మట్టుబెట్టారు. వన్యప్రాణులకు అక్కడ రక్షణ లేకుండా పోతున్నదంటూ సామాజిక మాధ్యమాల్లో అనేకులు విరుచుకుపడ్డారు. అయితే ఇది యాదృచ్ఛికంగా జరిగిన ఘటనా లేక ఉద్దేశపూర్వకంగా చేసిందా అనేది ఇంకా తేలాల్సివుంది. కేరళకు అనేకవిధాల ప్రాముఖ్యత వున్నది. అక్కడున్న దట్టమైన అడవులు, కొండలు, నదులు అందరినీ విశేషంగా ఆకట్టుకుంటాయి. అది ఎప్పుడో అర్ధ శతాబ్దంకిందటే వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రం. అలాంటిచోట వన్య ప్రాణుల సంరక్షణ ఆందోళనకరంగా మారడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, పార్కులు, అడవులు వున్నచోటకు సమీపంగా జనావాసా లున్నప్పుడు సహజంగానే మనిషికి, మృగానికీ మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతుంటుంది. ఏనుగులు గుంపులుగా వచ్చి తమ పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయని, తమ ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నాయని జనం ఆరోపిస్తుంటారు. అలాగే వేసవికాలం వచ్చేసరికి పులులు వేట కోసం, నీటి కోసం జనావాసాలవైపు వస్తుంటాయి. కేరళలో వన్యప్రాణులపై దాడి ఘటనలు బాగా పెరిగాయని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2016 ఆగస్టు మొదలుకొని ఇంతవరకూ 23,182 ఉదంతాలు జరిగాయని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పంటలు ధ్వంసం చేయడం, మనుషులను, పశువులను చంపడం వంటి కారణాలతో ఈ దాడులు జరిగాయి. ఇందులో 2015–2019 మధ్య 543మంది పౌరులు మరణించారు. 23 వన్యమృగాలు చనిపోయాయి. జనావాసాల్లోకొచ్చే వన్యప్రాణుల్ని గుర్తించి వాటిని మళ్లీ లోపలికి పంపడం కోసం అనేకచోట్ల జనజాగ్రత సమితులు ఏర్పాటు చేయడం, కొన్ని బృందాలను ఏర్పాటు చేయడంలాంటి చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోంది. అయితే ఇవి సరిపోవడం లేదని, వన్యప్రాణులపై దాడులు ఆగడం లేదని తాజా ఉదంతాలు తెలియజేస్తున్నాయి.

కొందరైతే అనుకోకుండా ఏనుగు బలైపోయివుండొచ్చని వారు వాదిస్తున్నారు. దీనికి భిన్నమైన వాదన మరొకటుంది. వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి చుట్టూ కొంత ప్రాంతాన్ని తటస్థ ప్రాంతంగా గుర్తించి, అక్కడికి సాధారణ పౌరులెవరూ వెళ్లకూడదని ప్రభుత్వాలు ఆంక్షలు పెడతాయి.మరి కొందరు దళారులు తయారై ఈ తటస్థ ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా భూముల్ని చవగ్గా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని, ఎవరూ సంచరించని ప్రాంతం గనుక అధికార యంత్రాంగం పర్యవేక్షణ కూడా తక్కువగా ఉండటంతో అక్కడ భూమి కొన్నవారు పంటలు పండించుకోవడం వంటివి చేస్తున్నారన్నది మరికొందరి ఆరోపణ. ఏనుగులు విస్తారమైన ప్రాంతంలో సంచరించడానికి చూస్తాయి గనుక, సహజంగానే అవి వన్యప్రాణి కేంద్రాన్ని దాటి అప్పుడప్పుడు తటస్థ ప్రాంతానికొస్తాయని, వాటినుంచి పంటను కాపాడుకోవడానికి ఇలా మారణకాండకు పాల్ప డుతున్నారని అంటున్నారు. లోతుగా విచారిస్తే ఇప్పుడు జరుగుతున్న ఉదంతాల వెనకున్న కారణాలు వెల్లడవుతాయి. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటానికి వృక్ష, జంతుజాలాలను పరిరక్షించడం చాలా అవసరం. లేకుంటే అవి క్రమేపీ అంతరించిపోతాయి. కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు మేనకా గాంధీ లెక్క ప్రకారం దేశంలో ప్రస్తుతం 20,000 ఏనుగులు మాత్రమే మిగిలాయి. కారణం ఏదైనా వాటిని చంపుకుంటూ పోతే అవి కనుమరుగు కావడానికి ఎన్నో రోజులు పట్టదు అంటున్నారు. అదీ నిజమే కదా..? వన్య మృగాలను చంపి మనిషి మానవ మృగం అవుతున్నాడంటే అంతకు మించిన తలవంపు ఏమయినా ఉంటుందా?

## డయల్ 100 ద్వారా 3356 ఫిర్యాదుల పరిష్కారం

### కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి



కరీంనగర్, జూన్ 8 (నేటినిజం ప్రతినిధి):శాంతిభద్రతలకు సంబంధించి తలెత్తే సమస్యలపై సత్వరం స్పందన, పరిష్కారం కోసం ఏర్పాటైన "డయల్ 100" సేవలకు గత మే నెలలో 3356 అత్యవసర ఫిర్యాదులు అందగా పరిష్కరించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

దోపిడి, దొంగతనాలు, తగాదాలు,రోడ్డు ప్రమాదాలు, హత్యలు, హత్యాయత్నాలు, ఆత్మహత్యలు, తప్పిపోవుట, కిడ్నాప్, అత్యాచారయత్నాలు, గృహహింస, అసాంఘీక కార్యకలాపాలు మొదలగు ఆపదలు సంభవించిన సందర్భంలో "డయల్ 100" సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లాలో గడిచిన మే నెలలో 3068 ఫిర్యాధులను స్వీకరించి పరిష్కరించడం జరిగింది. ఇందులో 49 ఫిర్యాధులపై కేసులు నమోదు చేయడం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.

## క్వారంటన్ కేంద్రంలో యువతికి సర్పంచ్ వేధింపులు

### –సోషల్ మీడియా పోస్ట్‌తో రంగంలోకి దిగిన పోలీసులు

భువనేశ్వర్,జూన్8(ఆర్ఎన్ఎ): క్వారంటైన్ కేంద్రంలో ఉంటున్న ఓ యువతిపై స్థానిక సర్పంచ్ వేధింపులకు పాల్పడిన ఘటన ఒడిసాలోని సువర్ణపూర్ జిల్లా దుంగురిపల్లి సమితి అందారిబంచిలో చోటుచేసుకుంది. కరోనా కారణంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న వలస కార్మికులను కేంద్ర ప్రభుత్వం వారివారి సొంత రాష్ట్రాలకు తరలిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల తమిళనాడు నుంచి వచ్చిన కొంతమంది వలస కార్మికులను సువర్ణపూర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రంలో ఉంచారు. అయితే, దుంగురిపల్లి సమితి అందారిబంచిలోని క్వారంటైన్ కేంద్రంలో ఉంటున్న ఓ యువతి తనను స్థానిక సర్పంచ్ వేధిస్తున్నాడని, రాత్రిపూట మద్యం తాగివచ్చి అసభ్యకరంగా ప్రవర్తించాడని క్వారంటైన్ నిర్వాహకులకు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో జరిగిన ఘటనను వివరిస్తూ తనకు న్యాయం చేయాలని బాధిత యువతి సోషల్ మీడియాలో వీడియో పెట్టింది. దీంతో వీడియో వైరల్ కావడంతో స్పందించిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## స్వీయ నిర్బంధంలోకి సిఎం కేజ్రీవాల్

### నేడు కరోనా టెస్టులు నిర్వహించే అవకాశం

న్యూఢిల్లీ,జూన్8(ఆర్ఎన్ఎ): ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్వీయనిర్బంధంలోకి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన సమావేశాలన్నీ రద్దు చేసుకున్నారు. జ్వరం, గొంతునొప్పి లక్షణాలు కనిపించడంతో సీఎం కేజ్రీవాల్

స్వీయనిర్బంధంలోకి వెళ్లారు . ఆయన కుటుంబ సభ్యులు కూడా హోంక్వారంటైన్‌లోకి వెళ్లారు. కేజ్రీవాల్‌కు మంగళవారం కరోనా పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. కరోనా వైరస్ పాజిటివ్ కేసుల్లో దేశ రాజధాని ఢిల్లీ మూడో స్థానంలో నిలిచింది. ఢిల్లీలో 28,936 పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఇప్పటి వరకు 812 మంది ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఉదయం ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యేందర్ జైన్ మీడియాతో మాట్లాడారు. రాబోయే రెండు వారాల్లో ఢిల్లీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 56 వేలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి 8,500 నుంచి 9 వేల వరకు బెడ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. మరో 15 రోజుల్లో బెడ్ల సంఖ్యను 15 వేల నుంచి 17 వేలకు పెంచుతామన్నారు. కేంద్రం సరైన సమయంలో విమానాలను ఆపేసి ఉంటే.. తీవ్రత ఇంతగా ఉండేది కాదని ఆరోగ్య శాఖ మంత్రి అన్నారు.

## పిఐబి చీఫ్‌కు కరోనా పాజిటివ్

### –కాంటాక్ట్‌పై ఆరా తీస్తున్న అధికారులు

న్యూఢిల్లీ,జూన్8(ఆర్ఎన్ఎ): ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ప్రిన్సిపల్ కేఎస్ ధత్వాలియాకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణయ్యింది. పిఐబికి నాయకత్వం వహించే ధత్వాలియా కేంద్ర ప్రభుత్వానికి కూడా ప్రధాన ప్రతినిధి. కరోనా పాజిటివ్ రావడంతో చికిత్స కోసం ఆయనను ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో గత రాత్రి 7 గంటల సమయంలో జాయిన్ చేశారు. అయితే అతని ఆరోగ్య పరిస్థితిపై ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు. ధత్వాలియాకు కరోనా సోకడంతో జాతీయ మీడియా కేంద్రాన్ని సోమవారం రోజున మూసి, శానిటైజ్ చేయనున్నట్లు పీఐబీ అధికారులు తెలిపారు. అయితే ధత్వాలియా ఈ మధ్య జరిగిన మంత్రివర్గ సమావేశంలో నరేంద్ర సింగ్ తోమర్, ప్రకాష్ జవదేకర్‌లతో కలిసి సమావేశంలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. దీంతో అతని ప్రైమరీ, సెకండరీ కాంటాక్ట్ లను గుర్తించడంపై అధికారులు దృష్టి సారించారు.

## 13లక్షల టన్నుల ఇసుక మాయం: దేవినేని

అమరావతి,జూన్8(ఆర్ఎన్ఎ): ఏపీలో ఇసుక అక్రమాలపై టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ...ఏడాది పాలనలో 13 లక్షల టన్నుల ఇసుక వైసీపీ నేతలు మాయం చేశారని చంద్రబాబు నాయుడు చెప్పారు. లారీ లోడ్ అవ్వాలంటే వెయ్యి ఇవ్వాల్సిందే. అధికారులు ఇవ్వాల్సిన ఇసుక ఆన్‌లైన్ కూపన్లు సైతం మీ పార్టీ నేతల ఇంటి వద్దే పంపిణీ. మీ నాయకులు చేస్తున్న వేలకోట్ల ఇసుక దోపిడీకి ఏం సమాధానం చెప్తారు సీఎం జగన్ గారు అంటూ దేవినేని ప్రశ్నించారు.

# నీటివివాదాలు రాకుండా చూసుకోవాలి

హైదరాబాద్, జూన్ 8:తెలుగు రాష్ట్రాల్లో ప్రాజెక్టుల నిర్మాణం భవిష్యత్‌లో రైతులకు వరప్రదాయిని కావాలే కానీ .. ఇరు రాష్ట్రాల్లో వివాదాలకు దారితీయరాదు. పోతిరెడ్డి పాడు .. పోలవరం,కాళేశ÷-వరం ప్రాజెక్టు ఏదైనా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సాగుతాగునీటి సమస్యలు తీర్చాలే తప్ప మరిన్ని సమస్యలకు కారణం కారాదు. మిగులు జలాలను పంచుకునే విషయంలో ఉమ్మడి నిర్ణయాలతో ముందుకు సాగాలి. కేటాయింపు నీటినైనా పరస్పర అంగీకారంతో వినియోగించుకోవాలి. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన గొడవలు చాలు. మరోమారు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య నీటి వివాదాలు ఉండకుండా చూసుకోవాల్సన బాధ్యత ఇరు రాష్ట్రాల సిఎంల బాధ్యత. ఇరు రాష్ట్రాల సిఎంలు కూర్చుని వివాదాలకు తావులేని విధంగా వాతావరణం మార్చాలి. విపక్షాలకు అవకాశం లేకుండా చేయాలి. నీటి అవసరాలు తీర్చేందుకు చేస్తున్న కార్యక్రమాలు అద్భుత ఫలితాలు ఇవ్వబోతున్న తరుణంలో వివాదాలు సరికాదు. కృష్ణా,గోదావరిబోర్డుల మెట్లెక్కి పరస్పరం ఆరోపణలు చేసుకోకుండా చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుని హుందాతనం చాటాలి. ఇతర రాష్ట్రాలకు, దేశానికి ఓ సమర్థ నాయకత్వం కారణంగా నీటి సమస్యలను పరిష్కరించు కోగలిగారని తెలియచేయాలి. నాగార్జునసాగర్, శ్రీశైలం లాంటి ప్రాజెక్టులు ఉన్నా నీటిని నిల్వచేసకునే సామర్థ్యం లేకపోతోంది. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్న వేళ వివాదాలతో బృహత్ సంకల్పం దెబ్బతినకుండా చూసుకోవాలి. పోలవరం,హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులు ఎపి ముఖ చిత్రాన్ని మార్చను న్నాయి. ఎపి ఉమ్మడిగా ఉండగా ఇలాంటి ప్రాజెక్టుల ఊసులేకుండా పోయింది. విభజన తరవాత నష్టపోయామన్న వాదనలు పక్కన పెట్టి అభివృద్దికి బాటలు వేసుకోవాలి. అలాగే తెలంగాణలో కూడా ఉమ్మడిగా ఉన్నప్పుడు పెద్దగా ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదు. చెరువుల గురించి ఆలోచన చేయలేదు. రైతుల గురించి మాట్లాడలేదు. ఈ దశలో ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలు యావత్ దేశానికి తలమానికంగా ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో పాటు, వివిధ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల గోదావరి, కృష్ణ జలాలు ఇరు రాష్ట్రాల అవసరాలు తీర్చనున్నాయి. గోదావరి జలాల వృధాను అరికడితే ఇరు రాష్ట్రాల నీటి దారిద్యం తీరగలదు. కాళేశ్వరం ,మల్లన్నసాగర్ అందుబాటులోకి వస్తే భూగర్భజలాలు కూడా పెరుగు తాయి. గోదావరిలో వరద వచ్చినప్పుడు పోలవరం ద్వారానీటికి అడ్డుకట్ట పడగలదు. ఇలాంటి ప్రాజెక్టులు, నదుల అనుసంధానం మాత్రమే మన అవసరాలను తీర్చగలవు. ప్రాజెక్టుల ద్వారా సముద్రంలో కలిసే వృధానీటిని అరికట్టాలి. నదుల అనుసంధానంపైనా ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించాలి. లేకుంటే ప్రస్తుత వర్షాభావ పరిస్థిలను చూస్తే వ్యవసాయంతో పాటు, తాగునీటికి కూడా దుర్భర పరిస్థితులు ఏర్పడ గలవు. తెలంగాణలో కాళేశ్వరం, మల్లన్నసాగర్,కొండపోచమ్మ లాంటి ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వాల్సి ఉంది. నీటిని ఆదా చేసుకునేందుకు, నిల్వ చేసుకునేందుకు చెరువులను కాపాడుకుంటూనే వర్షాకాలం లేదా తుఫాన్ల సమయంలో వచ్చే వర్షాలతో నీటిని నింపుకోవాలి. లేకుటే భవిష్యత్ దుర్భరంగా మారగలవు. ఓ వైపు మొక్కల పెంపకం, మరోవైపు వాతావరణంకాపాడుకునే స్థితులను సృష్టించుకోకుంటే రాబోయే తరాలు క్షమించవు. ఏటా వర్షాభావ పరిస్థితులు అన్నదాతలను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయి. తొలకరిలో కొంత ఊరించిన వర్షాలతో గత వైభవం వస్తుందని సంతోషించిన రైతుల అంచనాలు తలకిందుల వుతున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో మిషన్ కాకతీయ, కాళేశ్రం, సీతారామ తదితర ప్రాజెక్టుల వల్ల రానున్న కాలంలో నీటి అవస్థలు ఉండకపోవచ్చు. ఇదే విషయాన్ని సిఎం కెసిఆర్ కూడా పదేపదే చెబుతున్నారు. నిరంతరం నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. నలుగురికి అన్నం పెట్టే అన్నదాతతో ప్రకృతి ఆటాడుకుంటుంది. ఖరీఫ్ ఆరంభంలో వరుణిడి కరుణతో పుష్కలంగా వానలు పడడంతో అన్నదాత రెట్టించిన ఉత్సాహంతో సాగును ప్రారంభించడం, తరవాత నమ్ముకున్న వరుణుడు ముఖం చాటేయడంతో కర్షకుడి ఆశలు ఆవిరవుతున్నాయి. నేలరాలని చినుకులు, మండుతున్న ఎండలతో పంటలు నిలువునా ఎండిపోతుంటే కన్నీరు మున్నీరవుతున్నాడు. నాలుగు చినుకులు పడినా పంటలు వేద్దామని దుక్కులు దున్ని భూములను సిద్ధం చేసుకుంటున్న తరుణంలో బీడు భూములుగా మారుతున్నాయి. ఏటా వస్తున్న కష్టాలను దిగమింగుకుని వేలకు వేలు అప్పులు తెచ్చి పంటలు వేస్తే చినుకు లేక పంటలు ఎదుగుబొదుగు లేకుండా ఉంటున్నాయి. వానదేవుడా కరుణించు అంటూ అన్నదాత ఆకాశం వైపునకు చూస్తున్నా ఫలితం కానారాని పరిస్థితులు పోవాలి. సరైన నీటివనరులు లేకపోవడంతో ఏటా రైతులకు పంటల సాగులో నష్టాలు తప్పడం లేదు. అన్నదాతల్లో సన్నచిన్నకారు రైతులే అధికం. ఎకరం రెండు ఎకరాలు సాగు చేసుకుని జీవిస్తున్న గిరిజన కుటుంబాలు వేలల్లో ఉన్నాయి. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు తీవ్రవర్షాభావం వల్ల ఎండుతున్న పంటలను చూసి లబోదిబో మంటున్నాయి. కళ్లెదుటే పంటలు వాడిపోతున్నా ఏమీ చేయలేక నిస్సహాయ స్థితిలో మగ్గుతున్నారు. పంటలసాగుకు అనుకూలంగా ఉంటుందని అంచనా చేసిన అన్నదాతలు ఏటా వానలు ముఖం చాటేయడంతో ఆందోళనలో పడిపోతున్నారు. పంటను కాపాడు కునేందుకు పడరాని పాట్లు పడుతున్నా చివరికి చేతికందేది ప్రశ్నార్థకమే. ఈ దశలో వ్యవసాయం కోసం దీర్ఘకాలికప్రణాళికలు వేయాల్సిన అవసరాన్ని సిఎం కెసిఆర్ గుర్తించారు. సాగును గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వృధానీటికి అడ్డుకట్ట వేసేలా చిన్నచిన్న రిజర్వాయర్లను నిర్మించుకోవాలి. అప్పుడే వర్షాభావంనుంచి బయటపడ గలమని గుర్తుంచుకోవాలి. సాగుతాగునీటికి శాశ్వత ప్రణాళికలే దేశానికి శ్రీరామరక్షగా గుర్తించాలి. ఆ మేరకు కార్యాచరణ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న పనులు లేదా కార్యాచరణ రైతాంగానికి శాశ్వతంగా నీటి సమస్యలను దూరం చేసేవిగా ఉండాలి.తెలంగాణ సిఎం కెసిఆర్ నీటి అవసరాలు తీర్చబోతున్న తీరు అభినందనీయం. దీర్ఘకాలిక ప్రయోజనాలు లక్ష్యంగా సాగుతున్న పనులు సత్ఫలితాలు ఇచ్చేలా చూసుకుంటే సమస్యలు రావు.

# నకిలీ విత్తన విక్రేతలపై ముప్పేట దాడి

## సమచారం అందడమే ఆలస్యం దాడులు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): నకిలీ విత్తనాలు అమ్మే విక్రేతల భరతం పట్టేందుకు అధికారులు ఎక్కడిక్కడ దాడులు చేస్తున్న క్రమంలో భారీగా పత్తి,తదితర విత్తనాలు బయటపడుతున్నాయి. ఇందుకోసం పోలీస్‌శాఖ, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గతేడాది ఉమ్మడి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీగా అనుమతి లేని నకిలీ విత్తనాలు, పురుగుమందులు లభ్యం కావడంతో ఈ ఏడాది నిఘా ముమ్మరం చేశారు.. రైతుల అవసరాలను అవకాశంగా చేసుకొని నకిలీ విత్తనాలు అంటగట్టి సొమ్ము చేసుకునే దళారులపై వ్యవసాయ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు.. టాస్క్‌ఫోర్స్, పోలీసులు, వ్యవసాయాధికారులు నిరం తరం విత్తన షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.. ఆయా డివిజన్ల వారీగా బృందాలను ఏర్పాటు చేసి నకిలీ విత్తన విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నకిలీ విత్తన వ్యాపారులపై ఉక్కుపాదం మోపేందుకు వ్యవసాయ శాఖతో పాటు పోలీస్ శాఖ సమాయత్తమవుతోంది.పల్లెల్లో రైతుల ఇంటి వద్దకు వెళ్లి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. వ్యవసాయశాఖ సంచాలకు లతో పాటు మరో మూడు శాఖల అధికా రుల బృందాలు దాడులు నిర్వహించన న్నారు. గతేడాది విత్తన షాపులపై అధికారులు తనిఖీలు చేసి 12 షాపుల విత్తన డీలర్లపై కేసులు నమోదు చేసి పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశారు. ఇప్పటికే విత్తన షాపులు తెరవడంతో అధికారులు తనిఖీలు ప్రారంభించారు.

పోలీస్, విత్తనాభివృద్ధి సంస్థ, తెలంగాణ సీడ్స్ అధికారులతో కూడిన తనిఖీల బృందం దాడులు ముమ్మరం చేస్తోంది. జిల్లాలోని నకిలీ పత్తి విత్తనాలు విక్రయించే వ్యాపారులపై వ్యవసాయ అధికారుల బృందం నిఘా పెట్టింది. సమాచార వ్యవస్థను పటిష్ఠ పరిచి నకిలీ విత్తన వ్యాపారుల ఆట కట్టించేందుకు ఆకస్మిక దాడులు చేయనున్నారు. జిల్లాలోని ప్రతి షాపును విజిలెన్స్ బృందాలు తనిఖీ చేసి నిబంధనల ప్రకారం సీడ్స్‌ను విక్రయిస్తున్నారా.. లేదా.. ఏ కంపెనీ సీడ్స్.. ఎక్కడి నుంచి వచ్చాయోననే వివరాలపై ఆరా తీస్తున్నారు. ప్రతి ఏడాది బీటీ–3 పత్తి విత్తనాలు దొడ్డిదారిలో డీలర్లు విక్రయించడం వల్ల రైతులు నష్టపోతున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ సంవత్సరం అధికారులు నకిలీ వ్యాపారులను పట్టుకునేందుకు పూర్తిస్థాయి నిఘా పెంచారు. నకిలీ విత్తనాలు, మందులు కొనుగోలు చేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితి ఏర్పడకుండా ప్రభుత్వం విత్తనాలు, మందులు విక్రయించే వ్యాపారులు, దళారులపై నిఘా పెంచింది. నకిలీ విత్తనాలు రైతులకు అంటగట్టే దళారులపై కొరడా ఝుళిపించనుంది. ఎప్పటికప్పుడూ తనిఖీలు చేపడుతూ విత్తనాలు, పురుగు మందులు విక్రయించే వ్యాపారులను హెచ్చరిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గోడౌన్‌లు, ట్రాన్స్‌పోర్టులపై నిఘా.. ఖమ్మం నగరంలోని పలు ట్రాన్స్‌పోర్టు, ఆయా కంపెనీల, డీలర్లకు చెందిన గోడౌన్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించారు. మండలాల పరిధిలో మండల వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక సర్కిల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆ ధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, బస్‌స్టేషన్‌లు, రైల్వే పార్సిల్స్ తదితర ప్రదేశాలపై నిఘా పెంచారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని వ్యాపారులకు సూచిస్తున్నారు. నాణ్యమైన పత్తి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా డివిజన్ వ్యవసాయ అధికారులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన బి.తిరుపతికి లక్ష రూపాయల ఎల్వోసీని అందచేసినమంత్రి కొప్పుల ఈశ్వర్

## జైపూర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి కలకలం

మంచిర్యాల,జూన్8(ఆర్ఎన్ఎ): అడవుల్లో ఉండాల్సిన జంతువులు జనారణ్యంలోకి వచ్చి భయాందోళన లకు గురి చేస్తున్నాయి. జిల్లాలోని జైపూర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుండటంతో ఆ ప్రాంతంలో అలజడి నెలకొన్నది. ఆదివారం రాత్రి ముదిగుంట గ్రామం శివారు లో పెద్దపులి పాడి బర్రెపై దాడి చేసి చంపేసింది. ముదిగుంట, మిట్టపల్లి, కాంకూర్, గుడిపల్లి అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్న ఆనవాళ్లు కనిపిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందేమోనని బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు పులిని బంధించి తమకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.

## అభివృద్ధి చేస్తున్నా..విమర్శలా?

### కంటితడిపెట్టిన పోచారం

కామారెడ్డి,జూన్8(ఆర్ఎన్ఎ): బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం కష్టపడుతున్నా తనపై కొందరు ఆరోపణలు చేస్తున్నారని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. కోటగిరి మండలం హంగర్లలో డబుల్ బెడ్ ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న పోచారం.. సభలోనే ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు సరిపోక కాంట్రాక్టర్లు ముందుకు రాకపోయిన..? బతిమిలాడి పనులు చేయిస్తున్నానని తెలిపారు స్పీకర్ పోచారం. అయినా తనపై ఆరోపణలు చేయడం బాధిస్తుందన్నారు. పేదల సంక్షేమం లక్ష్యంగా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సిఎం కెసిఆర్ ఆశయాలతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయిస్తున్నామని అన్నారు. బాన్సువాడకు 5,000 ఇళ్లు మంజూరయ్యాయని ఆయన వివరించారు. అవి పూర్తి చేసేందుకు నిధులు సరిపోకపోవడంతో ఎన్నో కష్టాలు పడి నిర్మాణ పనులను పూర్తి చేయిస్తున్నానని తెలిపారు. తాను ఇంతగా కష్టపడుతుంటే కొందరు మాత్రం తనపై పలు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

## కుప్పకూలిన శిక్షణ విమానం

### ఇద్దరు శిక్షణ పైలట్ల మృతి

భువనేశ్వర్,జూన్8(ఆర్ఎన్ఎ): ఒడిశాలో శిక్షణ విమానం కూలి ట్రెయినర్‌తో సహా ఇద్దరు మరణించారు. డెంకనాల్ జిల్లాలోని బిరసాల్ ఎయిర్‌పోర్టులో టేక్ ఆఫ్ అయిన కొద్దిసేపటికే శిక్షణ విమానం కుప్పకూలింది. దీంతో శిక్షణ పొందుతున్న మహిళా పైలట్ అనీస్ ఫాతిమా, శిక్షకుడు కెప్టెన్ సంజీబ్ కుమార్ ఝా అక్కడికక్కడే మృతిచెందారు. అనీస్ ఫాతిమా తమిళనాడుకు చెందినవారు కాగా, సంజీబ్ కుమార్ బీహార్‌కు చెందినవారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామక్షయనగర్ సబ్‌డివిజనల్ దవాఖానకు తరలించామని ఎస్పీ అనుపమా జేమ్స్ వెల్లడించారు. ఒడిశాలోని 19 రన్‌వేలలో ఒకటైన బిరసలాలో ప్రభుత్వ శిక్షణా కేంద్రం నడుస్తున్నది. ఇక్కడ 90 మంది పైలట్లు శిక్షణ పొందుతున్నారు. మార్చి 25న దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన తర్వాత, జూన్ 1న ఈ శిక్షణ కేంద్రం పునఃప్రారంభమైంది.

## చిరుతను చంపి ఊరేగించిన గ్రామస్థులు

గౌహతి,జూన్8(ఆర్ఎన్ఎ): జనవాసంలోకి వచ్చిన ఓ చిరుతను స్థానికులు కొట్టి చంపారు. అసోం రాజధాని గౌహతి శివారు ప్రాంతంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. చిరుత సంచారం గురించి తెలుసుకున్న స్థానికులు దాన్ని వెంబడించి దారుణంగా కొట్టి చంపారు. అనంతరం చనిపోయిన చిరుతను గ్రామంలో ఊరేగించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వీడియో ద్వారా ఆరుగురిని గుర్తించి అరెస్ట్ చేశారు. చిరుతను పట్టుకునేందుకు తాము ఓ బోనును ఏర్పాటు చేశామని, అయితే అది తప్పించుకున్నదని వారు చెప్పారు. కాగా, అటవీశాఖ అధికారులు ముందుగానే చిరుతను బంధించి ఉంటే స్థానికులు దాన్ని చంపి ఉండేవారు కాదని కొందరు గ్రామస్థులు పేర్కొన్నారు.

## పల్లె ప్రగతితో..అభివృద్ధి పరవళ్లు



జగిత్యాల,జూన్ 8: గత ప్రభుత్వాల పాలనలో కంటే టీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి ఏ విధంగా జరిగిందో ప్రజలు పరిశీలించాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పల్లె ప్రగతిలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం నర్సింగపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పల్లెప్రగతితో గ్రామాల్లో చాలా అభివృద్ధి జరిగిందన్నారు. దీంతో కరోనా వైరస్ వ్యాప్తి చెందలేదని పేర్కొన్నారు. ఇండ్లను శుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. లేదంటే వర్షాకాలంలో తొందరగా వ్యాధులు వ్యాపి చెందుతాయని పేర్కొన్నారు.

పల్లెల అభివృద్ధి కోసమే పల్లెప్రగతి కార్యక్రమం అని తెలియజేశారు. రైతులు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రూ. 30 వేల కోట్లు పెట్టి వడ్లు కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో కరెంటు, ఎరువుల కోసం నిత్యం ధర్నాలు జరిగేవి. ఇప్పుడు ఆ పరిస్థితి ఉందా? ఒకసారి ఆలోచించండని ప్రజలను కోరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగే ప్రసక్తే లేదన్నారు. ఎన్ని నిధులు కావాలో అన్ని సమకూర్చుతానని అభివృద్ధి పనులు చేయించుకోండని మంత్రి హామీ ఇచ్చారు.

## పోలీస్‌స్టేషన్ల రైటర్లకు శిక్షణ

కరీంనగర్,జూన్ 8(నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన రైటర్ల శిక్షణ కార్యక్రమం సోమవారం నాడు కమిషనరేట్ కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌యండి ఎస్ఐ నరేష్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ల నిర్వాహణలో రైటర్ల పాత్ర కీలకమన్నారు. స్టేషన్ రైటర్లు టిఎస్‌కాప్ యాప్‌నకు అనుసంధానం అయ్యే వివిధ రకాల యాప్‌ల వినియోగంపై పట్టుసాధించాలని చెప్పారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శ్రద్దాసక్తులతో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కేసుల రికార్డులలో సాంకేతికపరమైన లోపాలులేకుండా చూసుకోవాలని తెలిపారు. సిసిటిఎన్ఎస్ ప్రాజెక్టులో పెండింగ్‌లో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలందించవచ్చని తెలిపారు. పోలీస్‌స్టేషన్లలో క్రమపద్ధతిలో రికార్డుల నిర్వాహణను కొనసాగించాలని, ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు కేసుల వివరాలను నమోదు చేయాలని చెప్పారు. వివిధ రకాల సమాచారాన్ని వేర్వేరుగా నిక్షిప్తం చేసినట్లయితే సులువుగా ఉండటంతోపాటు కేసుల నమోదు వివరాలు నమోదు చేయడంలో ఎలాంటి అనుమానాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

# నెక్లెస్‌రోడ్‌లో విడిసిసి రోడ్ల నిర్మాణం

## మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

హైదరాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): నగరంలోని ప్రధాన పర్యాటక ప్రాంతమైన నెక్లెస్‌రోడ్‌లో 26కోట్ల రూపాయల వ్యయంతో విడిసిసి రోడ్లను నిర్మిస్తున్నట్టు పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తెలిపారు. సోమవారంఅంబేద్కర్ నగర్‌లోని ట్రాన్స్‌పోర్ట్ యార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విడిసిసి రోడ్డు పనులను ఉన్నతాధికారులతో కలిసి మంత్రి తలసాని పరిశీలించారు. బుద్ధపూర్ణిమ ప్రాజెక్ట్ కింద సంజీవయ్య పార్కు నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకూ ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ రోడ్డుపనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. వాహనాల రాకపోకలు నిలిపివేసి రెండు షిఫ్టులలో పనులు చేయడం వల్ల త్వరితగతిన నిర్మాణం పూర్తవుతుందని మంత్రి తెలిపారు. నెక్లెస్‌రోడ్‌లో పచ్చదనాన్ని మరింత పెంచి ఆహ్లాదకర వాతావరణాన్ని అందించి ప్రజలకు వినోద, విహారస్థలంగా ఏర్పాటుచేస్తామని అన్నారు. ఈసందర్భంగా కార్యక్రమంలో మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, జీహెచ్ఎంసి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ విశ్వజిత్, హెచ్ఎండిఏ చీఫ్‌ఇంజనీర్ బిఎల్ఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నటుడు మురళీశర్మకు మాతృవియోగం



హైదరాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): భలేభలే మగాడివోయ్ సినిమాతో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్న మురళీశర్మ ఇంట విషాదం చోటు చేసుకున్నది. ఆయన తల్లి పద్మ శర్మ అకస్మికంగా మృతి చెందారు. ముంబైలో నివాసం ఉంటున్న పద్మ శర్మ వయసు మీద పడడంతో పలు అనారోగ్య సమస్యలతో మరణించారు. ఆమెకు 76 ఏండ్లు. ఈ విషయం పట్ల పలువురు సెలబ్రిటీలు సానుభూతి తెలిపారు.

అతిథి సినిమాతో 2007లో టాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన మురళీశర్మ విలన్‌గా ఎన్నో సినిమాల్లో నటించారు. మొదటి సినిమాతోనే నంది అవార్డును తన ఖాతాలో వేసుకున్న గొప్ప నటుడు. భలే భలే సినిమాలో తండ్రి పాత్ర మంచి పేరు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత తండ్రి, విలన్, పోలీస్ ఆఫీసర్ వంటి పాత్రలలో నటించి మెప్పించారు. ఇటీవల సంక్రాంత్రి కానుకగా విడుదల అయిన అల వైకుంఠపురం సినిమాతో మంచి క్రేజ్ వచ్చింది. అయితే.. మురళీ శర్మ కుటుంబం ముంబైలో స్థిరపడినప్పటికీ వీరిది తెలుగు కుటుంబమే. తండ్రి వృజ్ భూషణ్ మరాఠీ కాగా అమ్మ పద్మగారిది గుంటూరు. నాన్న వ్యాపారరీత్యా ముంబైలో స్థిరపడ్డారు.

# సరిహద్దులో పరిస్థితి అందరికీ తెలుసు: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, జూన్ 8: కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. సరిహద్దులో వాస్తవ పరిస్థితి అందరికీ తెలుసునంటూ ఎద్దేవా చేశారు. ఆదివారం బీహార్‌లో జరిగిన వర్చువల్ ర్యాలీ నుద్దేశించి మాట్లాడిన అమిత్ షా, దేశ రక్షణ వ్యవస్థ చాలా పటిష్టంగా ఉందన్నారు. రక్షణ పరంగా అమెరికా, ఇజ్రాయిల్ తర్వాత భారత్ సామర్థ్యం గురించి ప్రపంచానికి తెలుసునని, దేశ సరిహద్దులను కాపాడుకోగలమని ఆయన చెప్పారు.

దీనికి ప్రతీగా రాహుల్ గాంధీ సోమవారం ట్వీట్ చేశారు. 'సరిహద్దులో వాస్తవ పరిస్థితి ఏమిటన్నది అందరికీ తెలుసు. షా మంచి మాటతో గుండెలో ంతోషం కలుగుతున్నది' అని అందులో పేర్కొన్నారు. సరిహద్దులో భారత్, చైనా జవాన్ల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో రాహుల్ ఈ విధంగా స్పందించారు.

# ఎపిలో వేధిస్తున్న ఇసుక కొరత

## నిర్మాన రంగానికి అందు బాటులో లేని ఇసుక

## నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం

అమరావతి,జూన్8(ఆర్ఎన్ఎ): మొన్నటి వరకు కరోనా భయాలతో ఆగిపోయిన కార్యకలాపాలు మళ్లీ ఊపందుకున్నాయి. నిర్మాణ రంగం ఇప్పుడిప్పుడే మళ్లీ పుంజుకుంటోంది. దీంతో ఇంతకాలం వేధించిన ఇసుక సమస్యమళ్లీ మొదటికి వచ్చింది. ఇటీవలే సిఎం వైఎస్ జగన్ ఇసుక విధానంపై చర్చించారు. తెలుగుదేశం పార్టీ పాలనలో ఇసుక ఉచితం అంటూనే ఆ పార్టీ అనుయాయులకే రీచ్‌లు కట్టబెట్టడం, అదో పెద్ద మాఫియాగా మారడం దుమారం రేపింది. వైకాపా నేత జగన్ ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇసుక సరఫరా కొన్ని నెలలపాటు బంద్ చేసి, ఆ తరువాత ప్రకటించిన విధానం పారదర్శకంగా అనిపించినా ఆచరణలో అందుకు పూర్తి విరుద్ధంగా వుంది. ఎక్కడా ఇసుక దొరకడం లేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఇసుక సరఫరా వాహనాలను జియో పొజిషనింగ్ సిస్టమ్‌తో అనుసంధానం చేశామని, అంతా పారదర్శకమని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా ఆ వాహనాలు నల్ల బజారుకే తరలిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై టిడిపి ఇసుక పోరాటం చేస్తూ విమర్శలకు పదను పెట్టింది. రాష్ట్రంలో వ్యవసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి చూపేది భవన నిర్మాణ రంగమే! భవన నిర్మాణాలు వెనుక పడితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతుంది. కరోనా లాక్‌డౌన్‌తో వలస కార్మికులు స్వస్థలాలకు చేరడంతో భవన నిర్మాణ రంగంపై ఒత్తిడి మరింత పెరిగింది. వీరందరికీ పని కల్పించాలంటే తక్షణం ఇసుక అందుబాటు లోకి రావాలి. రాజధాని అమరావతి విషయంలో గందరగోళం ఏర్పడడంతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కొంత వెనుకపడింది. ఆర్థిక సంక్షోభం వల్ల అనేక భారీ నిర్మాణ ప్రాజెక్టులకు బ్రేకులు పడ్డాయి. ఈ నేపథ్యం లోనే బెంగళూరు, హైదరాబాద్ వంటివి ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే రియల్ ఎస్టేట్‌లో ముందంజలో వున్నాయి.ఎవరికైనా ఇసుక కావాలంటే దళారులను ఆశ్రయించక తప్పడం లేదని అంటున్నారు. అతి కష్టంమీద కొన్నా ధర విపరీతంగా వుంటోంది. కిందటి ఏడాది ధరతో పోల్చితే మూడు నాలుగు రెట్లు ఎక్కువగా వుండడం నిర్మాణదారులకు సమ్మెట దెబ్బలా వుంది. ఇసుక అందుబాటులో లేని కారణంగా భవన నిర్మాణాలు నిలిచిపోయి కార్మికులకు ఉపాధి పోయింది. కరోనా లాక్‌డౌన్‌తో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంకో వైపున సిమెంట్, స్టీల్, ఇటుక తదితరాల ధరలూ పెరిగాయి. అంత ధర పెట్టి వాటన్నిటినీ సమకూర్చుకున్నా కడదామంటే ఇసుక దొరకడం లేదని వాపోతున్నారు. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి, నాగావళి, వంశధార, పెన్న వంటి నదులతోపాటు అసంఖ్యాకమైన వాగులున్నా ఒక చిన్న ఇల్లు కట్టుకుందామంటే ఇసుక అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో ఇసుకను అందరికీ అందుబాటులో వుంచడం ప్రభుత్వ బాధ్యత. ధర తగ్గించడం, దళారీ వ్యవస్థ లేకుండా చేయడం సర్కారు తక్షణ కర్తవ్యం. ఇసుకను ప్రభుత్వానికి, అధికారపక్ష నాయకులకూ ఆదాయ మార్గంగా కాకుండా భవన నిర్మాణానికి ఉపయోగపడే ఒక ప్రధాన వనరుగా భావించాలి. భవన నిర్మాణమనే ప్రధాన కార్యకలాపం సాగించడం, తద్వారా లక్షలాది మందికి ఉపాధి కల్పించడం అనే విశాల దృక్పథంతో వ్యవహరించాలి.

# ధాన్యం తరలింపులో తప్పని ఎదురుచూపులు

## లారీల కొరతతో కాంటా వేసినా కదలని ధాన్యం

## వర్షాకాలం కావడంతో ఎక్కడ తడుస్తుందో అన్న భయాలు

## కాపలా కాయలేక ఆందోళనలో అన్నదాతలు

వరంగల్,జూన్8(ఆర్ఎన్ఎ): వరంగల్ ఉమ్మడి జిల్లాలో చాలచోట్ల సేకరించిన ధాన్యం తరలించక పోవడంతో ధాన్యం తడిసి ముద్దయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల ధాన్యం రెడీగా ఉంచినా తూకం వేయలేదు. దీనికితోడు 8వతేదీ వరకు ఇచ్చిన సేకరణ గడువు ముగియ డంతో ఆందోళన పడుతున్నారు. అసలే వర్షాకలం కావడంతో చేతికొచ్చిన ధాన్యం నీటిపాలవు తుందన్న భయం నెలకొంది. కొన్నిచోటల్ అధికారులు ఇచ్చిన టోకెన్ ప్రకారం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చారు. అయితే, ఇప్పటి వరకు కూడా తూకం వేయడం లేదు. లారీ వచ్చి ఇక్కడి ధాన్యాన్ని తీసుకెళ్తే తప్ప కాంటా వేయలేమని సిబ్బంది చెబుతున్నారు. అకాల వర్షాలతో భయంగా ఉందని వాపోతున్నారు. వర్షం కురుస్తున్నా కాంటాలు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం పేరుకపోయ్యింది. జిల్లా వ్యాప్తంగా 92 కేంద్రాలు నిర్వహిస్తుండగా, ఒక్కో కేంద్రం ప్రస్తుతం 10 నుంచి 90 లారీలకు సరిపడా ధాన్యం నిల్వ ఉన్నట్లు అంచనా. ఇందులో చాలా వరకు తూకం వేయని ధాన్యమే ఉ ండడం గమనార్హం. కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తూకం వేయకపోగా, తూకం వేసిన ధాన్యాన్ని సైతం తరలించేందుకు లారీలు పంపించక పోవడంతో నిద్ర, ఆహారం మానుకుని నిరీక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొనుగోలుకేంద్రాల వద్ద కుప్పలుగా ధాన్యం పేరుకుపోతున్నా అధికారులు పట్టించు కోవడం లేదని ఆరోపిస్తున్నారు. వరి ధాన్యం కొనుగోలుకు జిల్లాలో 92 కేంద్రాలు ఏర్పాటుచేశారు. జిల్లాలోని వరంగల్, కాజీపేట, ఖిలా వరంగల్, ఐనవోలు, హసన్‌పర్తి, హన్మకొండ, ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో ఈ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 29 కొనుగోలు కేంద్రాలు ఐకేపీ ఆధ్వర్యాన మిగిలిన 63 కేంద్రాలు ఆయా మండలా ల్లోని పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన నిర్వహిస్తునా న్రరు. ఈసారి టోకెన్ పద్ధతి ప్రారంభించిన అధికారులు టోకెన్లల తేదీల వారీగానే రైతులు తమ ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ఇంత వరకు బాగానే ఉ న్నా... కేంద్రాలకు తీసుకొచ్చిన వారి ధాన్యాన్ని కాంటా వేయడంతో అలసత్వం వహించారు. ఒకవేళ కాంటా పూర్తయినా మిల్లులకు తరలించడంలో లారీల కొరత కారణంగా జాప్యం జరుగుతుండడంతో రైతులే కాపలా ఉండాల్సి వస్తోంది.ఇందులో చాలా మంది రైతులు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 20 రోజులు దాటుతోందని తెలుస్తోంది. కాంటా పూర్తికాక ముందే వర్షం వస్తే తడిచిన ధాన్యాన్ని ఎవరు కొనుగోలు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. మిల్లుల వద్ద ధాన్యం దింపడానికి హమాలీల కొరత కారణంగా సమయం పడుతుండగా.. లారీలు కూడా సరిపడా సమకూర్చ లేకపోతునా న్రరని తెలుస్తోంది. కాగా, ధాన్యం తీసుకెళ్లడానికి లారీలు పంపించాల్సిన బాధ్యతను ప్రభుత్వం ఆర్టీఏ అధికారులకు అప్పగించింది. ఇకనైనా లారీ అసోసియేషన్ల బాధ్యులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యుల సమన్వయంతో లారీలను సమకూర్చి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల కరోనా కారణంగా లారీల వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని, వీటిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని అధికారులు చెప్పారు.

# పల్లెప్రగతితో గ్రామాల్లో అభివృద్ధి

## పారిశుద్యానికి పెద్దపీట వేశాం: ఎర్రబెల్లి

జగిత్యాల,జూన్8(ఆర్ఎన్ఎ): పల్లెప్రగతితో గ్రామాల్లో చాలా అభివృద్ధి జరిగిందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. దీంతో కరోనా వైరస్ వ్యాప్తి చెందలేదని పేర్కొన్నారు. ఇండ్లను శుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. లేదంటే వర్షాకాలంలో తొందరగా వ్యాధులు వ్యాపి చెందుతాయని పేర్కొన్నారు.గత ప్రభుత్వాల పాలనలో కంటే టీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి ఏ విధంగా జరిగిందో ప్రజలు పరిశీలించాలని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. పల్లె ప్రగతిలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం నర్సింగపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పల్లెల అభివృద్ధి కోసమే పల్లెప్రగతి కార్యక్రమం అని తెలియజేశారు. రైతులు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రూ. 30 వేల కోట్లు పెట్టి వడ్లు కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో కరెంటు, ఎరువుల కోసం నిత్యం ధర్నాలు జరిగేవి. ఇప్పుడు ఆ పరిస్థితి ఉందా? ఒకసారి ఆలోచించండని ప్రజలను కోరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగే ప్రసక్తే లేదన్నారు. ఎన్ని నిధులు కావాలో అన్ని సమకూర్చుతానని అభివృద్ధి పనులు చేయించుకోండని మంత్రి హామీ ఇచ్చారు.





వరంగల్ రూరల్ జిల్లా జిల్లాలోని రాయపర్తి మండలం మొరిపిరాల క్రాస్ వద్ద రాయపర్తి మాజీ జెడ్పీటీసీ దివంగత భూక్య విజయ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.

# రైస్ మిల్లులకు మళ్లీ మంచిరోజులు

## ధాన్యం దిగుబడులతో నిరంతరాయంగా పనులు

నల్లగొండ,జూన్8(ఆర్ఎన్ఎ): రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ సారథ్యంలో అన్ని రంగాలకు ప్రాధాన్యమిచ్చారు. ప్రధానంగా వ్యవసాయానికి సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. దీంతో పంటల సాగు పెరిగి రైస్ మిల్లులకు మళ్లీ జీవం వచ్చింది. రైస్ మిల్లులకు కరెంట్ కోతలు లేకపోవడం, జనరేటర్ ఖర్చులు తగ్గడంతో మిల్లుల యాజమాన్యాలకు కొంత వరకు ఊరట కలిగింది. నిరంతరం కరెంట్ సరఫరాతో వేలాది మందికి ఉపాధి లభించింది. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి మంచి సహకారం అందించడంతో అనేక మంది వ్యాపారులు నూతన టెక్నాలజీతో రైస్ మిల్లులు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం నూతన టెక్నాలజీతో మిర్యాలగూడలో నడుస్తున్న రైసుమిల్లులు మంచి లాభదాయకంగా ఉండటంతో కొత్తగా వ్యాపారం చేయాలనుకునే వారు రైస్ ఇండస్ట్రీ వైపు దృష్టి సారిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా సింగిల్‌విండో పద్ధతిలో అనుమతులు మంజూరు చేస్తుండటంతో పట్టణంలో రాబోయే రెండేళ్లలో మరో 50కి పైగా రైసుమిల్లుల ఏర్పాటుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. గతంలో విపరీతమైన కరెంట్ కోతల కారణంగా రైస్ ఇండస్ట్రీ తీవ్ర నష్టాల పాలయ్యింది. కరెంటు ఖర్చుతో పోల్చితే జనరేటర్ డీజిల్ ఖర్చు మూడుపాళు అధికంగా అయ్యేవి. దీంతో రైసు ఇండస్ట్రీ యాజమాన్యాలు నష్టాల పాలయ్యారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం లెవీ ఎత్తివేయడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో జిల్లాలో 30 రైసుమిల్లులు మూత పడ్డాయి. జిల్లాలో ఏటా 140 మిల్లుల నుంచి లెవీపూల్ బియ్యం సేకరణ జరుగుతోంది. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు సన్నబియ్యం రైస్‌మిల్లర్ల ద్వారా ప్రభుత్వం సేకరిస్తున్నది. అంతేగాక రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం రైస్ మిల్లులకు తరలించి తిరిగి బియ్యం తీసుకునే విధానాన్ని పౌరసరఫరాల శాఖ చూస్తోంది. తెలంగాణ ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం చార్జీలను సైతం పెంచింది. దీంతో మిల్లులకు చేతినిండా పనిదొరకడంతో లాభాలబాట పట్టాయి. దీనికితోడు ఆయకట్టు ప్రాంతంలో పంటల దిగుబడి బాగా ఉండటంతో మిల్లర్లకు బయటి నుంచి ధాన్యం కొనుగోలు చేసే బాధలు తప్పాయి. ధాన్యం సరిపడా రావడంతో వ్యాపారులతోపాటు మిల్లులపై ఆధారపడి ఉపాధి పొందుతున్న కూలీలు ఆనందంగా ఉన్నారు. జిల్లాలో ఉన్న 140 రైస్ మిల్లుల్లో సుమారు 40 వేల మంది వివిధ రకాల కార్మికులు ఉపాధి పొందుతున్నారు. గతంలో కరెంటు కోతలతో రైస్ ఇండస్ట్రీ అనేక సమస్యలు ఎదుర్కొంది. రోజుకు 10 గంటలు కరెంట్ ఉంటే మిగతా సమయంలో జనరేటర్ మీద మిల్లులు నడిచేవి. దీంతో చాలా నష్టాలొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కరెంటు కష్టాలు తొలిగినయ్. హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం ఇస్తుండడంతో రైస్ మిల్లులు మళ్లీ కుదుటపడ్డాయని మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి రమేశ్ అన్నారు.

## హరితహారం కోసం సిద్ధం అవుతున్న జిల్లా

# 20 నుంచి కార్యక్రమం అమలుకు ఏర్పాట్లు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్8 (ఆర్ఎన్ఎ): హరితహారం విజయం కోసం జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్ఉల చేస్తోంది. ఈ నెల 20నుంచి మొదలు కానున్న ఈ కార్యక్రమం కోసం అటవీశాఖ సన్నద్ధం అవుతోంది. ఇటీవల మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేసిన సూచనల మేరకు అధికారులు నర్సరీల్లో ఉన్న మొక్కలను నాటేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నెల 20న ప్రారంభమయ్యే ఆరో విడత హరితహారం కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ఎంవీ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో ఈసారి 1.96 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆరో విడత హరితహారం కార్యక్రమానికి జిల్లా అధికారులు ముందస్తుగానే సన్నద్ధమయ్యారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఒక్కొక్క పంచాయతీలో ఒక్కో నర్సరీని ఏర్పాటు చేశారు. వీటిలోని మొత్తం మొక్కల సంఖ్య కోట్ల సంఖ్యలో ఉంది. టేకుతో పాటు వెదురు, దానిమ్మ, నిమ్మ, జామ, సీతాఫలం, బొప్పాయి, ఖర్జూరం, నిద్ర గన్నేరు, మల్బరీ వేప, గానుగ, వేప, కదంబ, గుల్‌మొహర్, మారేడు, స్పాంథోడియా, కరివేపాకు, గోరింట, ఉసిరి, చింత, రేగు, ఈత, నేరేడు తదితర మొక్కలు ఉన్నాయి. ఈ విడత హరిత హారంలో టేకు, పండ్ల మొక్కలను ఎక్కువగా నాటనున్నారు. ఇదిలా వుంటే ఈ ఏడాది రెండులక్షల సెరీకల్చరల్ మొక్కలు, 3.5 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలను ఉద్యాన శాఖ నర్సరీల్లో పెంచామని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. మామిడి, జీడిమామిడి, నిమ్మ, దానిమ్మ, నారింజ, బత్తాయి, సపోట, పనస మొక్కలను కూడా పెంచామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, రహదారుల పక్కన, చెరువు గట్లపై నాటేందుకు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటివరకు ఐదు విడతల్లో నిర్వహించిన కార్యక్రమాలు సత్ఫలితాలనివ్వగా ఆరో విడత విజయవం తానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతు న్నాయి.. ఈ ఏడాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు రెండు కోట్ల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.. ఈ నెల 20 నుంచి కార్యక్రమం మొదలుకానుంది. ఇప్పటివరకు ఐదు విడతల్లో నిర్వహించిన కార్యక్రమాలు సత్ఫలితాలనివ్వగా ఆరో విడత విజయవం తానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతు న్నాయి.. ఈ ఏడాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు రెండు కోట్ల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. నర్సరీల్లో మొక్కల పెంపకానికి, సంరక్షణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఒక్కో నర్సరీలో మొక్కల పెంపకం-సంరక్షణకు 10 మంది ఉపాధి హామీ కూలీలను, వీరిపై పర్య వేక్షణకు ఒక వన సేవకుడిని నియమించారు. నర్సరీల నిర్వహణ బాగోగులపై స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు శ్రద్ధ పెట్టారు. ఇలా సమష్టి కృషి ఫలితంగా అన్ని నర్సరీల్లో మొక్కలు ఎదిగాయి. ఈ మొక్కలను 20వ తేదీ నుంచి హరితహారం కార్యక్రమంలో నాటనున్నారు.

## గ్రామాల్లో పచ్చదనం పెంపునకు కృషి

నిజామాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): హరతహారంపై ప్రజలో చైతన్యం తీసుకురావడానికి, నాటిన మొక్కలను కాపాడేందుకు ప్రజల పాత్రను గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి తెలిపారు. 20నుంచి ప్రారంభం కానున్న హరితహారం కోసం పూర్తి ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇందు కోసం మొక్కలు నాటి, వాటిని సంరక్షించే వారికి వ్యక్తి గతంగా కాని లేదా ప్రభుత్వ శాఖపరంగా కాని ఎంపిక చేసిన అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని మరింత పగడ్బందీగా నిర్వహించేదుకు ఈ వినూత్న కార్యచరణకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. హరితహారం కార్యక్రమం కేవలం ప్రభుత్వరంగ సంస్థలకే పరిమితం కాకుండా, ఇందులో ప్రజల పాత్ర కూడా ప్రధానంగా ఉండేలా సర్కారు నిర్ణయం తీసుకుందన్నారు. ఇందుకోసం ప్రజలను చైతన్య పర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం తలపెట్టిన హరిత తెలంగాణలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా డీఎఫ్‌వో పేర్కొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం అయిన యంత్రాగం

## -కలెక్టర్ ఆదేశాలతో గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలు

మంచిర్యాల,జూన్8(ఆర్ఎన్ఎ): వర్షాకాలంలో ప్రారంభమైందంటే సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు తీవ్రంగా ప్రబలుతుంటాయి. సాధారణంగా ఈ సమయంలోనే డెంగ్యూ వంటి విషజ్వరాలు విజృంభి స్తుంటాయి. దీంతో ఒకేసారి వ్యాధుల ముప్పేట దాడితో ప్రమాదం రెండింతలయ్యే అవకాశం లేకపోలేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు కరోనా విలయతాండవం చేస్తున్న ఈ సమయంలోనే.. మరోవైపు డెంగ్యూ ముప్పు కూడా పొంచి ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ దశలో పల్లె,పట్టణ

ప్రగతి కార్యక్రమాలతో జిల్లాల్లో పారిశుద్య కార్యక్రమాలను చేపట్టారు. ప్రజలను చైతన్యం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భారతి హోళికేరి సూచించారు. ఇప్పటికే ఆమె జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్య నిర్వహణతో పాటు తగు చర్యలు తీసుకోవాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు వ్యాపించకుండా మురుగుకాల్వలు, చెత్త చెదారం నిల్వవుండకుండా చూడటంతో పాటు గృహాలు, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వవుండకుండా చూసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల నివారణ చర్యలకు సంబంధిత వైద్యాధికారులతో సమన్వయంతో చర్యలు చేపట్టడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ పిచికారి, క్లోరినేషన్ పనులు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నీరజ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రిలకు ఈమేరకు తగిన సూచనలు చేశారు.

వర్షాకాలపు వ్యాధుల నియంత్రణలో ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరోనా వైరస్ నియంత్రణలో వైద్యాధికారుల కృషి అభినందనీ యమని, సీజనల్ వ్యాధులను కూడా ధరిచేరకుండా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు.

# నటి చందన ఆత్మహత్య కేసులో దినేశ్ అరెస్ట్

బెంగళూరు,జూన్8(ఆర్ఎన్ఎ): కన్నడ నటి చందన ఆత్మహత్య కేసులో ఆమె ప్రియుడు దినేష్‌ను పోలీసులు అరెస్ట్ చేసారు. సూసైడ్‌కి ముందు చందన.. తనను దినేష్ ప్రేమించి మోసం చేసాడని ఓ వీడియో తీసి ఆరోపించింది. ఆ వీడియో ఆధారంగా పోలీసులు దినేష్ ను అరెస్ట్ చేసారు. వీడియోలో తనను దినేష్ శారీరకంగా వాడుకున్నాడని ఇప్పుడు మోసం చేస్తున్నాడని ఆరోపించింది. అతను మోసం చేయడంతో జీవితం పై విరక్తి పుట్టిందని తెలిపింది. అంతే కాకుండా చందన ఆత్మహత్య తరవాత దినేష్ పరార్ అయ్యాడు. దాంతో కూతురు ఆత్మహత్య తరవాత ఆమె తల్లి తండ్రులు దినేష్ పై కేసు నమోదు చేసారు.

# ఆదిలాబాద్ లో నకిలీ బీటీ-3 విత్తనాల పట్టివేత



ఆదిలాబాద్,జూన్ 8: పట్టణంలోని రాంనగర్ లో అక్రమంగా నిల్వ ఉంచిన నకిలీ బీటీ-3 పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామ్ నగర్ కు చెందిన షేక్ మహరాజ్, మహమ్మద్ ముస్తఫాలు ఇటీవల మధ్యప్రదేశ్ కు చెందిన కాలుసింగ్ అనే వ్యక్తి నుంచి నకిలీ విత్తనాలను తీసుకువచ్చినట్లు గుర్తించారు. పోలీసులు వారి ఇండ్లలో దాడులు నిర్వహించి 785 విత్తనాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

వీటి విలువ సుమారు రూ. 5.5 లక్షలు ఉంటుందని ఎస్పీ విష్ణు వారియర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లాలో నకిలీ విత్తనాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఇద్దరు ఇన్ స్పెక్టర్లు ,10 మంది పోలీసు అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. రైతులు తక్కువ ధరకు విత్తనాలు అమ్మే వారిని నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీడీ కేసులు నమోదు చేసి జైలుకి పంపిస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలకు సంబంధించిన సమాచారం పోలీసులకు ఇవ్వాలని ఆయన కోరారు.

# భక్తులకు దర్శనమిస్తున్న ఎములాడ రాజన్న



రాజన్న సిరిసిల్ల,జూన్ 8 (నేటినిజం ప్రతినిధి):వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం భక్తుల దర్శనాల నిమిత్తం సోమవారం తిరిగి తెరుచుకుంది. కరోనా మహమ్మారి కారణంగా విధించిన లాక్‌డౌన్ నేపథ్యంలో గడిచిన 80 రోజులుగా ఆలయంలోకి భక్తుల అనుమతిని నిరాకరించారు. ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్త ఆలయాలు భక్తుల దర్శనానికి తెరుచుకున్నాయి. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఈ తెల్లవారుజామున 4 గంటలకు తెరిచిన అనంతరం ఆలయ పూజారులు వేదమంత్రోచ్చరణతో స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు.

అదేవిధంగా స్వామి శివుడికి ప్రాతఃకాల పూజను నిర్వహించారు. ఉదయం 6 గంటల తర్వాత ఆలయంలోకి భక్తులను అనుమతించారు. భక్తులకు థర్మల్ స్క్రీనింగ్‌ను నిర్వహించి శానిటైజేషన్ టన్నెల్స్ ద్వారా శానిటైజేషన్ చేసి అనంతరం స్వామి దర్శనానికి అనుమతిస్తున్నారు. గంటకు 200 మంది భక్తులను మాత్రమే ఆలయంలోకి వదులుతున్నారు. 65 ఏండ్లకు పైబడ్డ వారిని, గర్భిణీలను, పిల్లలకు దర్శనానికి అనుమతి లేదు.





జోగులాంబ ఆలయ తలుపులు తెరుచుకోవడంతో అమ్మవారిని సతీసమేతంగా దర్శించుకున్న మంత్రి నిరంజన్ రెడ్డి




మహబూబాబాద్‌లోని మురికి కాలువల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో ఎమ్మెల్యే శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, కలెక్టర్ గౌతమ్ ఉన్నారు.

# పట్టణ పారిశుద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

## ప్రజలను కోరిన -మంత్రి సత్యవతి

మహబూబాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): వానకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ప్రజలంతా పారిశుద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అధికారులకు సహకరించాలన్నారు. పట్టణ ప్రగతిలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మహబూబాబాద్ లోని మురికి కాలువల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఎమ్మెల్యే శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, కలెక్టర్ గౌతమ్‌తో కలిసి ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో పాటు మందు లేని మహమ్మారి కరోనా బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా మాస్క్ ధరించాలి. భౌతిక దూరం పాటించి పరిశుభ్రంగా ఉండాలన్నారు. మహబూబాబాద్ ని సర్వాంగ సుందరంగా ఉండేలా ప్రణాళిక రూపొందించుకుని అభివృద్ధి చేసుకుందామన్నారు. ఇందు కోసం నేతలు, అధికారులు అందరం కలిసి పని చేద్దామని మంత్రి సత్యవతి పేర్కొన్నారు.

# బలమైన నాయకుడు సీఎం వైఎస్ జగన్

## సన్మాన సభలో మంత్రి అవంతి శ్రీనివాస్

విశాఖపట్నం,జూన్8(ఆర్ఎన్ఎ): ఎంత బలంగా కొడితే అంత బలంగా పైకి లేచే నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని మంత్రి అవంతి శ్రీనివాస్ తెలిపారు. మంత్రి పదవి చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా విశాఖలోని పార్టీ కార్యాలయంలో అవంతిని పలువురు అనుచరులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. టీడీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు జూమ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. ప్రజాక్షేత్రంలో జగన్ అనే వ్యక్తిని.. చంద్రబాబు ఎదుర్కోలేరని తెలిసిపోయిందన్నారు. వైఎస్ జగన్ దేశంలోనే టాప్ సీఎంగా నాలుగో స్థానంలో ఉన్నారని.. త్వరలోనే నెంబర్ వన్ స్థానంలోకి వెళ్తారని అవంతి చెప్పుకొచ్చారు. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారికి వ్యాక్సిన్ వచ్చేంత వరకు ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. సామాజిక దూరం పాటిస్తూ మాస్కులు, శానిటైజర్‌లు వినియోగించాలన్నారు. నన్ను చాలా మంది విమర్శించారు. నా మీద హైకోర్టులో కేసు వేశారు. టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు గెలిచిన తర్వాత ఎప్పుడు ప్రజలకు కనిపించరు. త్వరలోనే మరికొన్ని నామినేటెడ్ పోస్టుల భర్తీ చేస్తాం' అవంతి శ్రీనివాస్ మీడియా ముఖంగా చెప్పారు.

# సూర్యాపేట జిల్లా జాన్‌పహాడ్ దర్గాలో మొదలైన ప్రార్థనలు

సూర్యాపేట,జూన్ 8 : లాక్‌డౌన్ ప్రభావంతో మూతపడిన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని జాన్‌పహాడ్ దర్గాలో తిరిగి ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. సోమవారం వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ ఎస్‌కె మహ్మద్, ముజావర్ జాని కలిసి దర్గా ప్రధాన ద్వారాన్ని తెరిచి భక్తులకు సైదుల్‌బాబా సమాధుల దర్శనం కల్పించారు.అనంతరం వారు బాబా సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాకు వచ్చే భక్తులు కరోనా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. భక్తులు భౌతిక దూరం, మాస్కులు తప్పని సరిగా ధరించాలని సూచించారు.



# పారిశుద్యానికి గ్రామాలు నిలయాలు కావాలి

## పచ్చదనంతో పరిశుభ్రంగా కనిపించాలి: పువ్వాడ

ఖమ్మం,జూన్8(ఆర్ఎన్ఎ): పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని పచ్చదనం, పరిశుభ్రతకు నిలయాలు కావాలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. పారిశుద్యానికి గ్రామాలు కేరాఫ్‌గా నిలవాలని అన్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అంజనాపురం గ్రామంలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. తొలుత గ్రామంలో రూ. 1.10 కోట్లతో అంజనాపురం ఎస్సీ కాలనీ నుంచి బిల్లుపాడు ఎస్సీ కాలనీ వరకూ నిర్మించనున్న సిసీ రోడ్డు, సైడ్ కాలువకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లలెల్లో పారిశుద్ధ్యం పకడ్బందీగా నిర్వహించాలని ,పరిశుభ్రమైన ప్లలెలు మానవ మనుగడకు, ఆరోగ్యానికి కూడా నిలయాలుగా మారుతాయని అన్నారు. ఖమ్మం జిల్లా పల్లె, పట్టణ ప్రగతిలో జిల్లా రెండోస్థానంలో ఉందని ఆయన తెలిపారు. అందుకు జిల్లా అధికార యంత్రాంగాన్ని అభినందించారు. గ్రామాల్లో పరిశుభ్రత ద్వారానే ఈ వానాకాలం సీజన్‌లో ప్రబలే అంటు, సీజనల్‌వ్యాధులను కూడా అరికట్ట గలుగుతామని అన్నారు. నూటికి 70శాతం ప్రజలు గ్రామాల్లో ఉంటున్నారని, గ్రామాలు బాగుంటేనే దేశం బాఉగుంటుందన్నారు. గ్రామాలు పచ్చగా, పరిశుభ్రతతో ఉండాలన్నారు. రైతులకు ప్రయోజనం కలిగించాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ సమగ్ర పంటల విధానం తీసుకు వచ్చారని అన్నారు. రైతులకు రుణమాఫీ, పంటల పెట్టుబడి, ఉచిత విద్యుత్ అందుబాటులో విత్తనాలు, ఎరువులు, రైతుబీమా చివరకు పంటల కొనుగోలు కూడా చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొన్నదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి నామానాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జడ్పీఛైర్మన్ లింగాల కమల్‌రాజ్ తదితరులు

# నేపాల్‌లో భారతీయ పాఠశాలలు



ఖాట్మండు,జూన్ 8: నేపాల్‌లోని విద్యావ్యవస్థ సాధారణంగా భారతీయ విద్యావ్యవస్థనే పోలి ఉంటుంది. నేపాల్‌లో కూడా త్రి టయర్ 16 ఏండ్ల విద్యావిధానమే కొనసాగుతున్నది. నేపాల్‌లో తొలిపాఠశాలను గురుకుల పాఠశాల మాదిరిగా 1853లో అక్కడి మహారాజు జంగ్ బహదూర్ రాణా స్థాపించారు. నేపాల్‌లో పాఠశాలల విద్యాను అందించేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. ఇప్పటికే నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో సీబీఎస్‌ఈ పాఠశాలలు నడుస్తుండగా.. రాజధాని నగరం ఖాట్మండులో కేంద్రీయ విద్యాలయాన్ని కూడా ఏర్పాటుచేసి పాఠశాల విద్య అందిస్తున్నారు. పబ్లిక్ స్కూళ్లలో నేపాలీ భాషలో విద్యాభ్యాసం కొనసాగుతుండగా.. విదేశాల్లో రాణించాలన్న ఉద్దేశంతో ప్రైవేట్ స్కూళ్లు సహా సీబీఎస్‌ఈ పాఠశాలలు ఆంగ్ల మాధ్యమంలో బోధన చేపట్టాయి.

గతంలో ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల మేరకు అక్కడి విద్యార్థుల కోసం పాఠశాలలు ఏర్పాటుచేసేందుకు భారత్‌కు చెందిన అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నేపాల్‌లోని ఏడు జిల్లాల్లో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ కోసం ఇరు దేశాల మధ్య ఒప్పందం జరిగింది. నేపాల్‌లో మొత్తం 56 హయ్యర్ సెకండరీ పాఠశాలల ఏర్పాటుకు ఈ ఒప్పందం చేసుకొన్నారు.

# యాదాద్రిలో నేటినుంచి సామాన్యులకు దర్శనాలు

యాదాద్రి,జూన్8(ఆర్ఎన్ఎ): లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం నుంచి దైవ దర్శనాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, స్థానికులకు అవకాశం కల్పించారు. మంగళవారం నుంచి అందరికీ దర్శనాలకు ఏర్పాట్లు చేయనున్నారు. మాస్కులు ధరిస్తేనే ఆలయ సిబ్బంది లోపలికి అనుమతి ఇవ్వనున్నారు. లడ్డు ప్రసాద కౌంటర్ల దగ్గర తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయం లోపల తీర్థ ప్రసాదాలను నిషేధించారు. చిన్నపిల్లలు, వృద్ధులు దర్శనాలకు రావొద్దని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు. కొండపైకి వాహనాలకు అనుమతి ఇవ్వలేదు. థర్మల్ స్క్రీనింగ్ టెస్టుల తర్వాతనే భక్తులను ఆలయంలోకి అనుమతించనున్నారు. అన్ని ఏర్పాట్లు చేసిన తరవాతనే అనుమతి ఇస్తున్నామని ఆలయ అధికారులు తెలిపారు.

# స్కూళ్లు తెరుచుకునేది ఆగస్టు 15 తర్వాతే..

న్యూఢిల్లీ:,జూన్ 8 ఆగస్టు 15 తర్వాతే స్కూళ్లు తెరుచుకునే అవకాశ మున్నదని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి (హెచ్ఆర్డీ) శాఖ వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా కరోనా కేసుల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అప్పటి పరిస్థితిని బట్టి ప్రభుత్వం వ్యవహరించవచ్చని చెప్పాయి. కేంద్ర హోంశాఖ, ఆరోగ్య శాఖ జారీ చేసిన మార్గదర్శకాల మేరకే పాఠశాలల పునరుద్ధరణపై హెచ్ఆర్డీ నిర్ణయం తీసుకునే అవకాశ మున్నదని వెల్లడించాయి. విద్యార్థుల రక్షణను దృష్టిలో ఉంచుకునే స్కూళ్లు తెరిచే తేదీని ఖరారు చేయవచ్చని పేర్కొన్నాయి. కేంద్ర హెచ్ఆర్డీ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్ కూడా ఇటీవల పలు సందర్భాల్లో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు.

### జూన్ 8 - జూలై 3 వరకు నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ వారి

# ఆన్‌లైన్ నైయిమిషా 2020- సమ్మర్ ఆర్ట్ కార్యక్రమం

హైదరాబాద్, జూన్ 8:నైయిమిషా 2020- సమ్మర్ ఆర్ట్ కార్యక్రమాన్ని సోమవారం (8వ తేదీ) నుంచి జూలై 3 తేదీ వరకు నిర్వహించనున్నట్లు న్యూఢిల్లీకి చెందిన నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ (ఎన్‌జీఎంఏ)సంస్థ ప్రకటించింది. కోవిడ్-19 మహమ్మారి కారణంగా లాక్‌డౌన్ అమలవుతున్న కారణంగా మ్యూజియంలు మరియు సాంస్కృతిక సంస్థలలోకి సందర్శకులు మరియు ప్రేక్షకులకు గతంలో మాదిరిగా అనుమతి లేదు. ఇది ఎన్‌జీఎంఏ తన ప్రేక్షకులకు చేరుకోవడానికి కొత్త ప్రాంతాలను మరియు ఆధునిక వేదికలను అన్వేషించడానికి దారితీసింది.

గడిచిన రెండు నెలలు అంతకు మించిన సమయంలో ఎన్‌జీఎంఏ అనేక కార్యక్రమాలను మరియు వివిధ ప్రదర్శనలను వర్చువల్ విధానంలో నిర్వహించింది. దేశంలో సాంకేతిక అభివృద్ధి అటువంటి కార్యక్రమాలను డిజిటల్‌గా నిర్వహించడానికి అవకాశాన్ని అందిస్తోంది. దీంతో ఎన్‌జీఎంఏ తన అత్యంత ప్రాచుర్యం పొందిన సమ్మర్ ఆర్ట్ ప్రోగ్రాం నైయిమిషాను డిజిటల్ వేదికగా నిర్వహించే దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టింది.

### ప్రకటనకు అనూహ్య స్పందన..

న్యూ ఢిల్లీలోని ఎన్‌జీఎంఏ నెల రోజుల ఆన్‌లైన్ సమ్మర్ కార్యక్రమంలో పాల్గొనే వారు ప్రాక్టిసింగ్ ఆర్టిస్టుల నుంచి నేర్చుకోవడం, నవ ఆవిష్కరణలు వంటి వాటిని చేరువచేసేలా పలు చర్యలు తీసుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్టిస్టుల ఆరోగ్యం విషయంలో ఏలాంటి రాజీ లేకుండా కళాకారులు పాల్గొనేలా వేదికను తీర్చిదిద్దింది. వర్చువల్ విధానంలో కళాకారులు కార్యక్రమంలో నిమగ్నతను మరింత పెంచే విధంగా ఎన్‌జీఎంఏ నాలుగు ఇన్‌క్ల్యూజివ్ వర్క్‌షాపులను ఎన్‌జీఎంఏ ప్రణాళికబద్ధం చేసింది. జూన్ 1 వ తేదీన ఈ నాలుగు వర్క్‌షాప్‌లకు సంబంధించిన ప్రకటనకు మంచి ఆదరణ లభించింది. ఔత్సాహికుల నుంచి దాదాపుగా 600 రిజిస్ట్రేషన్‌లు లభించాయి. ఆన్‌లైన్ నైయిమిషా - 2020 కార్యక్రమంలో, చిత్రకళ వర్క్‌షాప్, శిల్ప కళ, అచ్చు తయారీ మరియు ఇంద్రజల్ - ది మేజిక్ ఆఫ్ ఆర్ట్ (స్వేచ్ఛను అర్థం చేసుకోవడానికి ఇంటర్ డిసిప్లినరీ క్రియేటివ్ వర్క్‌షాప్) అనే పేరుతో నాలుగు కార్యశాలలను నిర్వహించనున్నారు. జూన్ 8 నుండి జూలై 3వ తేదీ వరకు వీటిని నిర్వహించనున్నారు.

### రెండు గ్రూపులుగా సెషన్ల ఏర్పాటు..

ఆన్‌లైన్ వర్క్‌షాప్‌ల సెషన్‌లు రెండు గ్రూపులుగా నిర్వహించబడతాయి: గ్రూపు 1:- 6 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల వరకు: ఉదయం 11 నుండి 11.35 వరకు మరియు గ్రూపు 2:- 16 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్కుల వారికి ఎలాంటిముగింపు సమయ పరిమితి లేకుండా: సాయంత్రం 4.00 నుండి సాయంత్రం 4.35 మధ్యనిర్వహించబడతాయి.

ఈ ప్రదర్శన ఒక గొప్ప ముందడుగు..

నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ (ఎన్‌జీఎంఏ) డైరెక్టర్ జనరల్ శ్రీ అద్వైత చరణ్ గరణాయక్ మాట్లాడుతూ.. "నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ (ఎన్‌జీఎంఏ) మొదటి డైరెక్టర్ జనరల్‌గా మ్యూజియంలను వర్చువల్ విధానంలో ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలని నేను గట్టిగా నమ్ముతున్నాను.

సమాజంలోని అన్ని వర్గాల వారిని మ్యూజియం మరియు దాని వివిధ కార్యకలాపాలలో నిమగ్నం చేసే దిశగా సమ్మర్ ఆర్ట్ ప్రోగ్రాం -2020 ఒక గొప్ప ముందడుగు.

సోమవారం నుండి తాను సీనియర్-జూనియర్ కళాకారుడితో పాటు మీ తెరపైకి చేరుకుంటాను మరియు మనమందరం కలిసి కళను నేర్చుకోవడానికి వాటిలో కొత్త విధానాలను సృష్టించడానికి ప్రయత్నిద్దాం. నైయిమిషా అనే కార్యక్రమం శీర్షిక ప్రజలు తమ శ్రద్ధ లేదా భక్తిని అందించే పవిత్ర స్థలాన్ని సూచిస్తుంది. ఎన్‌జీఎంఏ సంస్థ పరిధిని విస్తృతం చేయడం ద్వారా మరీ ముఖ్యంగా విద్యా రంగంలో ఒక సంస్థగా విస్తృతమవడం ద్వారా సమాజంలోని ప్రతి భాగానికి చేరువకాగలదని నేను విశ్వసిస్తున్నాను" అని అన్నారు.

### వివిధ ఆన్‌లైన్ వేదికలపైనా ప్రదర్శనలు..

నైయిమిషా -2020 సమ్మర్ ఆర్ట్ ప్రోగ్రాం ప్రదర్శనలో ఎంపికచేసిన కళాకృతులు ప్రజల వీక్షణ కోసం ఎన్‌జీఎంఏ సాంస్కృతిక మీడియా వేదిక అయిన ఎన్ఓ-హెచ్ఏఎం (నా-ఊంఓ) లో ప్రదర్శించబడుతాయి. ఆయా కార్యకలాపాల వివరాలు ఎన్‌జీఎంఏ యొక్క అధికారిక వెబ్‌సైట్ మరియు ఫేస్‌బుక్ పేజీలలోనూ అందుబాటులో ఉంటాయి. మరింత నవీకరించిన సమాచారం కోసం దయచేసి సందర్శించండి:

# మీలోని మ్యూజిక్ టాలెంట్ని గుర్తించేందుకు పేరుతో ఆన్లైన్ టాలెంట్ హంట్ నిర్వహిస్తున్న టిక్ టాక్

హైదరాబాద్, జూన్ , 8: వాస్తవికత సృజనాత్మకత కలయిక యొక్క వేడుకలతోనే కొత్త సంగీతం ఉద్భవిస్తుంది. అలాంటి కొత్త సంగీతాన్ని సృష్టించేందుకు కళాకారులు మరియు సంగీత దర్శకుల ఆవిష్కరణకు శక్తివంతమైన వేదికగా టిక్టాక్ మారింది. ఈ ప్రయాణంలో ఒక అడుగు ముందుకు వేసి, కొత్త స్వతంత్ర సంగీత ప్రతిభను కనుగొనటానికి ఇవాళ యాప్లో రీజినల్ మ్యూజిక్ టాలెంట్ హంట్ **మ్యూజిక్ స్టార్ తెలుగు** నిర్వహిస్తున్నట్లు టిక్ టాక్ ప్రకటించింది. జూన్ 7 న తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, పంజాబీ, బెంగాలీలతో సహా ఆరు భారతీయ భాషలలో ఈ టాలెంట్ హంట్ ప్రారంభమవుతుంది. ఈ టాలెంట్ హంట్లో విజేతలను జూన్ 21, ప్రపంచ సంగీత దినోత్సవం రోజున ప్రకటిస్తారు. ఉత్తేజకరమైన నగదు బహుమతులు గెలుచుకోవటానికి మించి, విజేతలు సోషల్ స్ట్రీమింగ్ ప్లాట్ఫామ్లో ప్రత్యేకంగా లభించే ప్రముఖ మ్యూజిక్ లేబుల్తో సంగీతాన్ని రికార్డ్ చేయడానికి విడుదల చేయడానికి రెస్సో ద్వారా అవకాశం పొందుతారు.ప్రముఖ కళాకారులు మరియు ప్రసిద్ధ సంగీత దర్శకులు వారి ప్రాంతం నుండి ప్రతిభ ఉన్న కళాకారుల్ని ఎంకరేజ్ చేస్తారు. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ కళాకారుల కోసం జి.వి.ప్రకాష్, సంగీత రాజీవ్, అనుప్ రూబెన్స్, కె.ఎస్. చిత్ర అందుబాటులో ఉంటారు. అలాగే పంజాబీ కోసం సుఖ్-ఇ, బెంగాలీ కోసం నుస్రత్ జహాన్.. పాల్గొనేవారి విశ్వాసాన్ని పెంచడం, ప్రోత్సహించడం తమ అభిమాన పోటీదా రునికి ఓటు వేయడం చేస్తారు. వినియోగదారులు వాటిని ప్రత్యక్ష ప్రసారం చేయడాన్ని మరియు ప్లాట్ఫామ్లో వారి హిట్ పాటలను ప్రదర్శించడం కూడా చూడవచ్చు.

ఈ షో ప్రతి ప్రాంతం యొక్క సంస్కృతి మరియు సంగీతాన్ని అందరికి తెలియచేస్తుంది. ఈ ప్రాంతంలోని వర్ధమాన సంగీత ప్రతిభకు వేదికను అందించడంపై దృష్టి పెడుతుంది. ఈ సందర్భంగా టిక్ టాక్ ప్రతినిధి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. భారతదేశం అద్భుతమైన ప్రతిభను కలిగి ఉంది, ముఖ్యంగా సంగీతం విషయానికి వస్తే ఆ ప్రతిభ అద్భుతం. ఇక క్రియేటివిటీ అనేది టిక్ టాక్ ఆపెం లో అంతర్భాగం. మేము చాలా మంది ప్రముఖ సృష్టికర్తలు, సంగీతకారులు మరియు స్వతంత్రులను చూశాము. కళాకారులు తమ ప్రతిభను అందరికి తెలిసేందుకు మరియు విస్తృత ప్రేక్షకులను చేరుకోవడానికి ఈ వేదికను ఉపయోగిస్తున్నారు. అందుకోసం అలాంటి యువతను ఎంకరేజ్ చేసే ఉద్దేశంతో **మ్యూజిక్ స్టార్ తెలుగు** మొదలుపెట్టాం. దీనిద్వారా ఆకర్షణీయమైన కంటెంట్ను వీక్షకులకు అందించడమే కాకుండా, దేశంలోని అన్ని మారుమూల ప్రాంతాలకు కూడా చేరుతుంది.

# చికిత్స కంటే నివారణ ముఖ్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుమన్ మోహన్ రావు



వేములవాడ,జూన్ 8 (నేటినిజం ప్రతినిధి):ఇంటిలో కుండీలు, కుండలు,కూలర్లు మొదలైన వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని చికిత్స కంటే నివారణ ముఖ్యం అని .జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.సుమన్ మోహన్ రావు అన్నారు .జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డెంగ్యూ నివారణార్థం సోమవారం వేములవాడ పట్టణ రిస్కఏరియాగా ప్రకటించిన 11,14,17 వార్డుల లో డెంగు నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా డాక్టర్ సుమన్ మోహన్ రావు మాట్లాడుతూ వర్షాకాలం కాబట్టి సీజన్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల జాగ్రత్తలను తీసుకోవాలని తెలిపారు .ప్రజలు కూడా తమ వాడుతున్న నీటి తొట్టెలను ప్రతిరోజూ శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అన్నారు .అలాగే ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ,లేకుంటే దోమలు ప్రబలి డెంగ్యూ ,మలేరియా లాంటి వ్యాధులు ప్రబలుతాయని అన్నారు .ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు ,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి , పట్టణ వైద్యాధికారి డా.రేగులపాటి మహేష్ రావు వైస్ చైర్మన్ మధు రాజేందర్,కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు , బింగి మహేశ్ , ఏ ఎన్ ఎం లు,ఆశావర్కర్లు ,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఇంటిపన్నును ఏడాదిపాటు రద్దు చేయాలి

## -గ్రేటర్ కమిషనర్‌కు రేవంత్ వినతిపత్రం

హైదరాబాద్,జూన్8(ఆర్ఎన్ఎ): కరోనా లాక్‌డౌన్‌తో ఉపాధి లేక రోడ్డున పడ్డ వారు అనేకమంది బాధపడుతున్న తరుణంలో ఇంటిపన్నును ఏడాదిపాటు వాయిదా వేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిశారు. ఏడాది పాటు గ్రేటర్ హైదరాబాద్‌లో ఇంటి పన్ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇంటి పన్ను కట్టే స్తోమత ప్రస్తుతం లేదని రేవంత్ తెలిపారు. ఉన్నత వర్గాల నుంచి వసూలు చేసినా అభ్యంతరం లేదన్నారు. త్వరగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు అభిప్రాయం తీసుకోవాలని కోరారు. ఆర్థిక పరిస్థితి బాలేదని ఉద్యోగుల జీతాల్లో కోత విధించారు. పేద, మధ్యతరగతి వారికి లాక్ డౌన్ సమయంలో ఆదాయం లేదని రేవంత్ పేర్కొన్నారు. అలాగే ఇంటి అద్దె కూడా వసూలు చేయవద్దని ప్రభుత్వం ఆదేశించడంతో వారికి అద్దెలు కూడా రావడం లేదన్నారు. సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లు ప్రజలకు అందుబాటులో ఉండరు కనుక కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించామని అన్నారు.

# కురుమూర్తిస్వామి సేవలో న్యాయమూర్తులు



మహబూబ్‌నగర్,జూన్ 8: రాష్ట్రవ్యాప్త ఆలయాలు భక్తుల దర్శనాల నిమిత్తం నేడు తెరుచుకున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్మాపూర్ గ్రామంలో కురుమూర్తి కొండలపై కొలువై ఉన్న కురుమూర్తి వెంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు తరలివెళ్తున్నారు. సతీమణితో కలిసి ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ స్పెషల్ జడ్జి రఘురాం, ఆత్మకూర్ జూనియర్ సివిల్ జడ్జి జీవన్ సుషాన్ సింగ్ ఈ ఉదయం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు న్యాయమూర్తులకు ఆహ్వానం పలికి శాలువతో సత్కరించారు. కురుమూర్తి క్షేత్రం ప్రత్యేకత పాదుకోత్సవం.

# భక్తులు సామాజిక దూరం పాటించాలి...



## - రాజన్నను దర్శించుకున్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్

వేములవాడ,జూన్ 8 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకోవడానికి వస్తున్న భక్తులు సామాజిక దూరం తప్పకుండా పాటించాలని, ఇనీలతిట-19 నిబంధనలకు అనుగుణంగా ఆలయ అధికారులు సూచించిన మేరకు భక్తులు సమన్వయం పాటిస్తూ రాజన్న దర్శనం చేసుకోవాలని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ అన్నారు. సోమవారం రాజన్నను దర్శించుకొని ఆలయంలోని పరిసరాలను క్యూలైన్లను లడ్డూ కౌంటర్లను పరిశీలించారు. భక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, శానిటైజర్ ను వాడాలని పేర్కొన్నారు. కరోనా వైరస్ పూర్తిగా నివారించాలని రాజరాజేశ్వర స్వామి వారిని వేడుకుంటున్నామని తెలిపారు. వారి వెంట చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య, పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.